

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక : 321 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా | బుధవారం 25 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 321 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : NTR DIST, | WED 25 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం..

ఏపీలో నేడు కూడా వర్షాలు

- ఏపీలో రానున్న నాలుగు రోజులు వర్షాలు
- పిడుగులు పడే అవకాశం ఉండటంతో అధికారుల హెచ్చరిక
- నేడు పలు జిల్లాల్లో మోస్తరు వర్ష సూచన
- ఉరుముల సమయంలో చెట్ల కింద ఉండవద్దని సూచన

- మిగతా 2లో



వావ్ నీ సంకల్పానికి ఆ విధి సైతం చప్పట్లు కొట్టాల్సిందే

పెన్ పవర్ డెస్క్: ఏపీ మంత్రి నారా లోకేశ్ ఓ ఆసక్తికర వీడియోను పోస్టు చేశారు. ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు దర్పణంలా నిలిచే ఓ దివ్యాంగుడి ప్రతిభను ప్రశంసించారు. దివ్యాంగుడైన మనోహర్ డ్యాన్స్ వీడియోని సామాజిక మాధ్యమాల్లో చూసిన మంత్రి లోకేశ్.. అతడి గురించి వివరాలను ఆరా తీసి ప్రతిభను ప్రశంసిస్తూ 'ఎక్స్'లో వీడియోని పోస్టు పెట్టారు. "నీ సంకల్పానికి ఆ విధి సైతం

- మిగతా 2లో





పసిఫిక్‌లో పెను ముప్పు..

10 డిగ్రీలు పెరిగిన వేడి!

మెగా ఎల్‌నినోతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం

- గాలాపగోస్ దీవుల వద్ద అసాధారణంగా పెరిగిన సముద్రపు వేడి
- కొన్ని ప్రాంతాల్లో 10 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతల నమోదు
- తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావమే కారణమని వెల్లడి
- దీన్ని 'మెగా ఎల్ నినో'గా అభివర్ణించిన అమెరికా వాతావరణ నిపుణులు
- గత రికార్డులను బద్దలు కొట్టవచ్చని హెచ్చరించిన నోవా, డబ్ల్యూఎంవో

- మిగతా 2లో

ఏపీలో వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మృతి..

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



- విజయనగరం, విశాఖ, పల్నాడు జిల్లాల్లో జరిగిన ఘటనలు
- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు సంతాపం
- ప్రమాద కారణాలపై విశ్లేషణ చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచన

పెన్ పవర్ డెస్క్:ఏపీలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 8 మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉదయం విజయనగరం, విశాఖపట్నం, పల్నాడు జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఓ వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.విశాఖ జిల్లా ఆనందపురం మండలం బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగి డ్రైవర్, క్లీనర్ సజీవ దహనమయ్యారు. ఇక, పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలో అమరావతిలో దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న అయ్యప్ప భక్తుల కారు, డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరొకరు గాయపడ్డారు.ఈ మూడు ఘటనలపై సమగ్ర సమీక్ష జరపాలని పోలీస్, రవాణా శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రమాదాల కట్టడికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు.

మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం

గాలింపు ముమ్మరం చేయాలి

అమరావతి: సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. గాలింపు చర్యలపై అధికారులతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బోటును గుర్తించేందుకు మరింత విస్తృతంగా గాలింపు చేపట్టాలని ఆదేశించారు. కాకినాడ జిల్లా ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 4న మోటరైజ్డ్ ఫిషింగ్ బోటులో వేటకు వెళ్లారు. పారాదీప్ పోర్టు సమీపానికి చేరుకున్నాక వారి నుంచి సమాచారం నిలిచిపోయింది. ఈ నెల 19 నుంచి బోటుతో సంబంధాలు తెగిపోయాయి. మొబైల్ ఫోన్లు, బోటులోని ట్రాన్స్‌పాండర్ స్విచ్

- మిగతా 2లో

1,008 కిలోల నెయ్యి, 1503 మీటర్ల వత్తి..

కనువిందు చేసిన కార్తిక మహాదీపం

పెన్ పవర్ డెస్క్: కార్తిక పౌర్ణమి పర్వదినాన యోగుల పర్వతం కైలాసాన్ని తలపించింది. చీకట్లను చీలుస్తూ ఎగసిన మహాదీపం వెలుగులు భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక పారవశ్యాన్ని నింపాయి. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న ఈ పవిత్ర గిరిపై మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మహాదీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఏక వీర సేవా

- మిగతా 2లో





హిజాబ్ లేకుండా పాట..

గాయనికి 74 కొరడా దెబ్బలు!

ఇరాన్‌లో గాయని పరస్తూ అహ్మదీపై శిక్ష అమలు

ఇరాన్‌లో మహిళల అణచివేత మరోసారి చర్చనీయాంశంగా మారింది. హిజాబ్ ధరించకుండా పాట పాడిన గాయనికి అక్కడి అధికారులు 74 కొరడా దెబ్బల శిక్ష అమలు చేశారు.

- మిగతా 2లో

కాశీ తరహాలో రాజమహేంద్రవరాన్ని

అభివృద్ధి చేస్తాం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



పెన్ పవర్ డెస్క్: ఆధ్యాత్మిక రాజధానిగా ఉన్న రాజమహేంద్రవరం నగరాన్ని కాశీ తరహాలో అభివృద్ధి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. నగరానికి బంగారు భవిష్యత్తు ఇస్తామన్నారు. చారిత్రక, వారసత్వ నగరం సమగ్ర అభివృద్ధి కోసం మంచి ప్రణాళిక

- మిగతా 2లో



రష్యాకు యుద్ధ దెబ్బ.. 4.9 లక్షల మంది మృతి?

లీకైన ప్రభుత్వ రికార్డుల విశ్లేషణలో వెలుగులోకి వచ్చిన ప్రాణనష్టం అంచనాలు

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్‌పై ఐదేళ్ల క్రితం రష్యా మొదలుపెట్టిన యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. 2022లో దురాక్రమణ ప్రారంభించినప్పటి నుంచి కనీసం 4.9లక్షల మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. వీరిలో కొన్ని వేల మంది 18 ఏళ్ల వయసువారే ఉండటం కలవరపెట్టే విషయం. మరోవైపు, ఐదేళ్ల కాలంలో

- మిగతా 2లో

సెప్టిక్ ట్యాంక్‌లో మృత్యుపాశం..

ముగ్గురు బలి!

విషవాయువులు పీల్చి ప్రాణాలు కోల్పోయిన శ్రీకాకుళం యువకులు

- బాచుపల్లి దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్‌లో ఘటన
- సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేస్తూ ముగ్గురు కార్మికులు మృతి
- విషవాయువులు పీల్చి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయిన వైనం
- మృతులు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు
- మృతదేహాలను బయటకు తీసిన హైడ్రా, ఫైర్ సిబ్బంది

- మిగతా 2లో



బాబాయ్‌ను దొంగ అన్నాడని.. క్లాస్‌మేట్ చెంప పగలగొట్టా!



చిన్ననాటి ఘటనను గుర్తు చేసుకున్న ప్రియాంకా గాంధీ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా తమ పాఠశాల రోజుల నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1977 నాటి ఎమర్జెన్సీ అనంతరం తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులు, ఆ సమయంలో పాఠశాలలో ఎదురైన అనుభవాలను వారు తాజా వీడియో సంభాషణలో గుర్తు చేసుకున్నారు.తమ తల్లి, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ

- మిగతా 2లో

ఆస్తులు తీసుకుని.. వదిలేస్తే జైలుకే!

తల్లిదండ్రులను పట్టించుకోని సంతానానికి మూడేళ్ల శిక్ష.. కేరళలో కొత్త చట్టం



- మిగతా 2లో

పెన్ పవర్

బుధవారం 25 నవంబర్ 2026



“సేన” సైకిల్ కు దూరమవుతుందా?

స్థానిక సంస్థల ఎన్నికలు దాదాపుగా ముగిశాయి. పంచాయతీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కూటమి పార్టీల మధ్య ఉండదు. అయితే కూటమిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఒకరకంగా చిచ్చుపెట్టాయనే చెప్పాలి. ప్రధానంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతల్లో అసంతృప్తి అయితే క్రమంగా బయటపడుతుంది. జనసేనలో పై స్థాయి నేతలు చంద్రబాబుకు అనుకూలంగా ఉన్నప్పటికీ కింది స్థాయిలో మాత్రం నేతలు పార్టీ నిర్ణయం పట్ల ఒకింత అసంతృప్తితోనే ఉన్నారు.సీట్ల సర్దుబాటు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఛైర్మన్లు, వైస్ ఛైర్లన్లు చేయడం కూడా జనసేన ద్వితీయ శ్రేణి నేతలకు మింగుడుపడటం లేదు. అధికారంలో ఉన్నారు కాబట్టి జనసేన కింది స్థాయి నేతలు ఇప్పుడు బయట పడటం లేదు. కానీ రానున్న కాలంలో జనసేనను నమ్ముకుంటే తమకు పదవులు రావన్న విషయం అర్థమయి వారు పార్టీకి దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ అసంతృప్తిని బయటపెడుతున్నారు.

క్యాడర్ మాత్రం...

పవన్ కల్యాణ్ , జనసేన మంత్రుల విషయంలో సాఫ్ట్ కార్నర్ గా ఉంటే సరిపోదు. కింది స్థాయిలో నేతలు మాత్రం తాము అన్యాయానికి గురవుతున్నారన్న భావనలో ఉన్నారు. ప్రధానంగా జనసేన, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం ఉన్న చోట కూడా జనసేన క్యాడర్ కు న్యాయం జరగడం లేదు. జనసేన కార్యకర్తలను దూరం పెడుతూ వస్తున్నారని, జనసేన టీడీపీ మధ్య గ్రౌండ్ లెవెల్లో చీలికలు స్టార్ట్ అయ్యాయని లీడర్లే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల డైరెక్ట్ తిరుగుబాట్లు మొదలయ్యాయి. పంచాయతీ ఎన్నికల నాటికి ఇవి పీక్స్ లోకి చేరాయి. ఏ స్థాయికి వచ్చాయి అంటే ఆఖరి దశలో ఏకంగా జనసేన పార్టీ ఆఫీసియల్ గా స్వేచ్ఛగా పోటీ చేసుకోండి అని లెటర్ విడుదల చేసింది. కానీ అప్పటికే డ్యామేజ్ అయిపోయింది. లాస్ట్ మూమెంట్ లో ఆర్డర్ వచ్చినా టీడీపీ వాళ్ళు కనీసం నామినేషన్ కూడా వెయ్యనివ్వడం పోవడం చర్చనీయాంశమైంది.

చివరకు పిఠాపురంలోనూ...

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం వైస్ ఛైర్మన్ ఎన్నిక లో కూడా గందరగోళం నెలకొంది. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అనుచరుడు చక్రిపై జనసేన నేతలు దాడి చేశారు.పిఠాపురం వైస్ ఛైర్మన్ పదవి కోసం కౌన్సిలర్లు బొజ్జ వెంకటేశ్వరరావు, పిండి సంధ్యాల మధ్య పోటీ నెలకొంది. వైసీపీ నుంచి వచ్చిన బొజ్జ శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంతో స్థానిక జనసేన నేతలు మండిపడుతున్నారు. స్థానిక నాయకత్వం పవన్ కల్యాణ్ ను తప్పుదోవపట్టించి వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పార్టీ విప్‌ను ధిక్కరించవద్దంటూ కౌన్సిలర్లతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మంతనాలు జరిపారు. ఏకగ్రీవంగా వైస్ ఛైర్మన్ బొజ్జ వెంకటేశ్వరరావు ఎన్నిక పూర్తయింది.ఈ నేపద్యంలో జనసేన మళ్ళీ టీడీపీకి 2024 స్థాయి మద్దతు ఇవ్వడానికి క్యాడర్ సిద్ధంగా లేదని చెబుతున్నారు. బీజేపీ జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అసంతృప్తిని ప్రకటించగా, తాజాగా విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా డిప్యూటీ మేయర్ తమకు ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టారు.

వావ్ నీ సంకల్పానికి ఆ విధి సైతం చప్పట్లు కొట్టాల్సిందే

- మొదటి పేజీ తరువాయి

చప్పట్లు కొట్టి అభినందించాల్సిందే మనోహర్. నీ ఆత్మవిశ్వాసం ఓ అద్భుతం. సోషల్ మీడియాలో నీ డాన్స్ వీడియో చూసి వివరాలు తెలుసుకున్నాను. నాటు నాటు పాటకు డ్యాన్సే కాదు.. మనోహర్ షాట్ పుట్ అథ్లెట్, పాటలు కూడా పాడతాడట. ఆర్డీటీలో మనోహర్ లాంటి వందలాది దివ్యాంగులకు నైతిక విలువలతో కూడిన విద్య, క్రీడలు, జీవన నైపుణ్యాలు నేర్పిస్తున్నారని తెలిసి సంతోషించాను. ఆకాశమే హద్దుగా ప్రయత్నిస్తున్న మీరు బాలబాలికల భవిష్యత్తుకు వెలుగు దీపికలు. నిండైన ఆత్మవిశ్వాసపు ప్రతీకలు.. మీ ప్రతిభ అనన్య సామాన్యం. మీ అందరికీ అభినందనలు, ఆశీస్సులు” అని పేర్కొన్నారు.

మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేయాలి

- మొదటి పేజీ తరువాయి

ఆఫ్ కావడంతో జీపీఎస్ ద్వారా కూడా ఆచూకీ లభించలేదు. కాకినాడ, చెన్నై, ఒడిశా కోస్ట్‌గార్డ్ అధికారుల సమన్వయంతో గాలింపు కొనసాగుతోంది. భారత కోస్ట్‌గార్డ్ నౌకలు, హెలికాప్టర్లతో పారాదీప్ తీరంలో గాలిస్తున్నారు. మత్స్యకారుల కుటుంబాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. గాలింపు పురోగతిని వారికి తెలియజేయాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు.

కాశీ తరహాలో రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

రూపొందించామని రానున్న రోజుల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. నగర అభివృద్ధిపై రూపొందించిన ప్రత్యేక మేనిఫెస్టోను రాజమహేంద్రవరంలో విడుదల చేశారు. తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, భాజపా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన, బీజేపీ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం శివారు ప్రాంతాలన్నింటికీ తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్య నివారణకు రోడ్ల అభివృద్ధి సహా రూ.89 కోట్లతో హ్యావలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. దేవాలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.100 కోట్లతో ప్రసాదం స్కీమ్ కింద నిధులు తెచ్చినట్లు తెలిపారు. వైకాపాకి ఓటు వేస్తే.. దుర్వినియోగం అయినట్లేనని వ్యాఖ్యానించారు. గోదావరిని స్వచ్ఛ గోదావరిగా మార్చడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రాజెక్టు తీసుకువస్తామన్నారు. గతంలో వైకాపా విధ్వంసకర పాలన అందించిందని, కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి వైపు రాజమహేంద్రవరం అడుగులు వేస్తోందని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం..
ఏపీలో నేడు కూడా వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏపీలో ఇవాళ పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో రోడ్లపై మోకాలి లోతున నీరు నిలిచింది. నెల్లూరులోనూ వర్షపాతం నమోదైంది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం, నైరుతి బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు తూర్పు గాలుల ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే వీలుంది. వీటితో పాటు మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడ చెదురుమదురు జల్లులు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పుల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు ఎవరూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండవద్దని స్పష్టం చేసింది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు వర్షం పడే సమయంలో సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని విజ్ఞప్తి చేసింది. అత్యవసరమైతే తప్ప వర్షం, పిడుగుల సమయంలో బయటకు రావద్దని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, అధికారులు ఎప్పటికప్పుడు తాజా వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

పసిఫిక్‌లో పెను ముప్పు.. 10 డిగ్రీలు పెరిగిన వేడి!

పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గాలాపగోస్ దీవులు, పెరూ తీరానికి సమీపంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఏకంగా 10 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావమే ఇందుకు కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మౌ, ఈ పరిణామాన్ని ‘మెగా ఎల్ నినో’గా అభివర్ణించారు. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) డేటా ఆధారంగా రూపొందించిన మ్యాప్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే, ఈ తీవ్రమైన వేడి పసిఫిక్‌లోని తూర్పు ప్రాంతంలోని ఒక హాట్‌స్పాట్‌కు మాత్రమే పరిమితమైందని, మొత్తం పసిఫిక్ మహాసముద్రం 10 డిగ్రీలు వేడెక్కిందని దీని అర్థం కాదని నిపుణులు వివరిస్తున్నారు. పసిఫిక్‌లోని విస్తృత మధ్య ప్రాంతాల్లో సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ ఎల్ నినో గణనీయంగా బలపడిందని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) కూడా ధ్రువీకరించింది. 1950 నుంచి నమోదైన ఎల్ నినో రికార్డులను ఇది అధిగమించే అవకాశం 60% ఉందని ఎన్ఓఏఏ అంచనా వేస్తోంది. ముఖ్యంగా 1997-98, 2015-16 నాటి శక్తిమంతమైన ఎల్ నినోలను ఇది మించిపోవచ్చని పేర్కొంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. చరిత్రలో నమోదైన అత్యంత శక్తిమంతమైన ఎల్ నినోలలో ఇది ఒకటిగా నిలవొచ్చని తెలిపింది.ఈ ఎల్ నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం ఉందని, దీనివల్ల రాబోయే నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని డబ్ల్యూఎంవో హెచ్చరించింది. ఎల్ నినో సమయంలో ఉష్ణమండల సముద్రంలో నిల్వ ఉన్న వేడి వాతావరణంలోకి విడుదల కావడమే ఇందుకు కారణమని వివరించింది. కాగా, గత అక్టోబర్‌లోనే పెరూ తీరం, గాలాపగోస్ పశ్చిమ జలాల్లో 6 నుంచి 7 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల కనిపించిందని యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ డేటా వెల్లడించింది.

సెప్టిక్ ట్యాంక్‌లో మృత్యుపాశం.. ముగ్గురు బలి!

హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ అపార్ట్‌మెంట్‌లోని సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ముగ్గురు కార్మికులు విషవాయువులు పీల్చి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బాచుపల్లి పరిధిలోని ఏపీఆర్ ఎన్‌క్లేవ్, దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్‌లో ఈ దుర్ఘటన జరిగింది. మృతులను శ్రీకాకుళం జిల్లాకు చెందిన పవన్ యల్లా (20), కె.షణ్ముఖరావు అలియాస్ సుమన్ (26), సురేష్ (24)గా గుర్తించారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ముగ్గురు యువకులు ఇలా అర్ధాంతరంగా మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర శోకం అలుముకుంది.దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్ యాజమాన్య సంఘానికి, ‘హెచ్‌ఆర్ ఇన్విరో’ అనే ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థకు మధ్య సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పనులకు సంబంధించి ఒప్పందం ఉంది. అపార్ట్‌మెంట్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు సదరు సంస్థ సిబ్బంది తరచూ ఇక్కడ క్లీనింగ్ పనులు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా హెచ్‌ఆర్ ఇన్విరో సంస్థకు చెందిన ముగ్గురు కార్మికులు సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. పని ప్రారంభించే క్రమంలో ఒకరి తర్వాత ఒకరు ట్యాంకు లోపలికి దిగారు. అయితే ట్యాంక్ లోపల తీవ్రమైన విషవాయువులు పేరుకుపోయి ఉండటంతో వారు ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. ఎంతసేపటికీ వారు బయటకు రాకపోవడంతో తోటి సిబ్బంది, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు, అత్యవసర విభాగాలకు

సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ నేతృత్వంలోని డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్యాంక్ లోపల దట్టమైన విషవాయువులు వ్యాపించి ఉండటంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. అయినప్పటికీ హైడ్రా, ఫైర్ సిబ్బంది సంయుక్తంగా శ్రమించి, పాతాళకాంత వంటి ప్రత్యేక రెస్క్యూ పరికరాల సాయంతో ముగ్గురి మృతదేహాలను ట్యాంక్ నుంచి బయటకు తీశారు.

సెప్టిక్ ట్యాంక్‌లో నిల్వ ఉన్న ప్రమాదకరమైన విషపూరిత వాయువులను పీల్చడం వల్లే ఊపిరాడక వారు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రష్యాకు యుద్ధ దెబ్బ.. 4.9 లక్షల మంది మృతి?

- మొదటి పేజీ తరువాయి

కొందరు సైనికులు బలవన్మరణానికీ పాల్పడినట్లు తేలింది. రష్యాలో ఇటీవల లీకైన ప్రభుత్వ రికార్డులను విశ్లేషించిన కొన్ని మీడియా సంస్థలు ప్రాణనష్ట అంచనాలను వెల్లడించాయి.దేశంలో జనన, మరణాలకు సంబంధించిన రికార్డులను నమోదు చేసే ఫెడరల్ స్టేట్ స్టాటిస్టిక్స్ సర్వీస్ ఏజెన్సీ డేటా ఇటీవల హ్యాకింగ్‌కు గురైంది. లీకైన డేటాలో జనవరి 2021 నుంచి సెప్టెంబర్ 2026 వరకు నమోదైన లక్షలాది పౌరుల మరణ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. వీటిని విశ్లేషించిన స్థానిక మీడియా సంస్థలు.. ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికే కనీసం 4.9లక్షల మంది రష్యన్ సైనికులు మరణించినట్లు గుర్తించాయి. మరణాల నమోదులో జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య 7లక్షల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేశాయి.ఈ రికార్డులను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల గణాంకాలతో పోల్చి చూశామని, ఇవన్నీ సరైనవేనని ధ్రువీకరించుకున్నట్లు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. మరణించిన రష్యన్ సైనికుల సగటు వయసు 2022లో 33గా ఉండగా.. 2026లో 40గా ఉన్నట్లు తెలిపాయి. చనిపోయిన వారిలో దాదాపు 7వేల మంది వయసు 18-19గా గుర్తించినట్లు చెప్పాయి. అయితే, వీరంతా నిర్బంధ సైనిక సేవకులే కావచ్చని అంచనా వేశాయి.

వందలాది ఆత్మహత్యలు..?

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా అనేక మంది రష్యన్ సైనికులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు 1229 మంది సైనికులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అంచనా. వీరిలో సగం మంది సరిహద్దు ప్రాంతాల్లోనే చనిపోయినట్లు భావిస్తున్నారు. ఇవన్నీ సైనిక శిబిరాలు, శిక్షణా కేంద్రాలు, ప్రైవేటు నివాసాల్లో చోటుచేసుకున్నట్లు వార్తా సంస్థల విశ్లేషణలో తేలింది. యుద్ధంలోకి పంపే విషయంలో ఒప్పందాలపై సంతకాలు చేయాలని తీవ్ర ఒత్తిడి చేయడమే బలవన్మరణాలకు ప్రధాన కారణంగా అనుమానిస్తున్నారు.ఇదిలాఉంటే, యుద్ధంలో ప్రాణ నష్టానికి సంబంధించి రష్యా చివరిసారిగా 2022లో గణంకాలను విడుదల చేసింది. ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడించలేదు. వీటిపై వచ్చే స్వతంత్ర నివేదికలకు విశ్వసనీయత లేదని రష్యా ప్రభుత్వం చెబుతోంది. రోస్టాట్ నుంచి కూడా డేటా లీక్ కాలేదని చెప్పడం గమనార్హం.

హిజాబ్ లేకుండా పాట..
గాయనికి 74 కొరడా దెబ్బలు!

- మొదటి పేజీ తరువాయి

యూట్యూబ్‌లో నిర్వహించిన సంగీత ప్రదర్శనలో ఆమె హిజాబ్ లేకుండా కనిపించడమే ఇందుకు కారణం.ఇరాన్‌కు చెందిన ప్రముఖ గాయని పరస్తూ అహ్మదీ ఈ శిక్షకు గురయ్యారు. 2024 డిసెంబర్‌లో ఖోమ్ నగరంలో ఆమె సంగీత ప్రదర్శన ఇచ్చారు. నలుగురు గాయకులతో కలిసి హిజాబ్ లేకుండా పాటలు పాడారు. ఆ సమయంలో అక్కడ ప్రేక్షకులు కూడా ఎవరూ లేరు. ఈ ప్రదర్శనకు సంబంధించిన వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయగా మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఇరాన్ న్యాయస్థానం.. అహ్మదీతో పాటు ఆమె బృందంలోని వారికి ఒక్కొక్కరికి 74 కొరడా దెబ్బల శిక్ష విధించింది. అంతేకాదు.. రెండేళ్ల పాటు విదేశీ ప్రయాణాలు, కళా, సంగీత కార్యకలాపాలపై నిషేధం విధించింది. తాజాగా నవంబర్ 23న గాయని అహ్మదీతో పాటు నలుగురు బృంద సభ్యులకు 74 కొరడా దెబ్బల శిక్ష అమలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. కాగా.. అమినీ అనే యువతి 2022లో హిజాబ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో నైతిక పోలీసులు (వీశీతీుశ్రీఱ్ఎ గ్రాశీశ్రీఅఎవ) అదుపులోకి తీసుకోగా.. కస్టడీలో మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ఇరాన్‌లో మహిళల హక్కులపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ఘటన మరోసారి అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. మహిళల వస్త్రధారణ, భావప్రకటనా స్వేచ్ఛపై ఇరాన్‌లో కొనసాగుతోన్న ఆంక్షలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

ఆస్తులు తీసుకుని.. వదిలేస్తే జైలుకే!

తల్లిదండ్రుల నుంచి ఆస్తులు రాయించుకుని, ఆ తర్వాత వారిని పట్టించుకోకుండా గాలికొదిలేసే పిల్లలకు కేరళం ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. అలాంటి బాధ్యతారహిత సంతానానికి ఏకంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సంచలన ప్రకటన చేశారు. సీనియర్ సిటిజన్ల సంరక్షణ, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర అసెంబ్లీ అక్టోబర్‌లో ఆమోదించిన నూతన బిల్లులో ఈ కీలక నిబంధనను చేర్చినట్లు స్పష్టం చేశారు. కొల్లం సమీపంలోని పతనపురంలో గల గాంధీభవన్‌లో రూ.20 కోట్ల వ్యయంతో వృద్ధుల కోసం అత్యాధునిక వసతులతో నిర్మించిన ‘పితృమందిరం’ నివాస సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఈ వివరాలు వెల్లడించారు.యూడీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకున్న తొలి నిర్ణయం వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడమేనని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే ఇలాంటి శాఖను నెలకొల్పిన తొలి రాష్ట్రం కేరళం అని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా వయోవృద్ధులకు పలు విశేష హక్కులను కల్పిస్తూ సమగ్ర చట్టాన్ని తెచ్చామని వివరించారు. గవర్నర్ ఆమోదం లభించి ఈ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి రాగానే, తల్లిదండ్రులను మోసం చేసే పిల్లలను కచ్చితంగా జైలుకు పంపుతామని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదని గట్టిగా చెప్పారు.పిల్లలను పెంచి పెద్ద చేయడానికి తల్లిదండ్రులు ఎంతటి కష్టాలు, త్యాగాలు భరిస్తారో సమాజం తెలుసుకోవాలని సతీశన్ ఉద్వేగంగా మాట్లాడారు. ఎదిగి పెద్ద స్థాయికి చేరిన తర్వాత కన్నవారిని అనాథలుగా వదిలేసే సంస్కృతి కేరళంలో ఉండకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను గుండెలకు హత్తుకుని చూసుకునే సరికొత్త సంస్కృతి సమాజంలో రావాలని, రాష్ట్రంలో ఏ ఒక్క వృద్ధుడూ ఒంటరి కాకూడదన్నదే తన ఆశయమని తెలిపారు. కాగా, ఈ పితృమందిరం నిర్మాణానికి పూర్తి ఆర్థిక సాయం అందించిన లులు గ్రూప్ ఛైర్మన్ ఎం.ఎ.యూసుఫ్ అలీని సీఎం కొనియాడారు. ఎంత సంపద ఉన్నా ఇతరులకు సాయం చేసే గొప్ప గుణం ఆయనకు ఉందని ప్రశంసించారు.

1,008 కిలోల నెయ్యి, 1503 మీటర్ల వత్తి..

- మొదటి పేజీ తరువాయి

ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలిరావడంతో కొండ ప్రాంతం కిక్కిరిసిపోయింది. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల హరహర మహదేవ, శంభో శంకర నామస్మరణల మధ్య అఖండ దీపాన్ని వెలిగించారు. కొండపై ఏర్పాటు చేసిన ఆరు అడుగుల కొప్పెరలో 1008 కిలోల స్వచ్ఛమైన ఆవు నెయ్యి పోసి 1,503 మీటర్ల పొడవైన వత్తితో మహా దీపాన్ని ప్రజ్వలింపజేశారు. ఆ దివ్యజ్యోతి వెలుగులు సమీప గ్రామాల ప్రజలను కనువిందు చేశాయి. ఈ మహాక్రతువును కనులారా వీక్షించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా విచ్చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏకవీర సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక యువత అన్నదానం, తాగునీటి సౌకర్యాలు కల్పించారు.

బాబాయ్‌ను దొంగ అన్నాడని..
క్లాస్‌మేట్ చెంప పగలగొట్టా!

- మొదటి పేజీ తరువాయి

రాసిన ‘బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకావిష్కరణ సందర్భంగా సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ సంభాషణలో సోనియా గాంధీతో పాటు రాహుల్, ప్రియాంక పాల్గొన్నారు. 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఓటమి పాలైన తర్వాతి రోజులను ప్రియాంక ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఆ సమయంలో పాఠశాలలో ఒక బాలుడు తన వద్దకు వచ్చి “తేరా చాచా జైల్ మే హై, చోర్ హై తేరా చాచా” (మీ బాబాయ్ జైల్లో ఉన్నాడు.. మీ బాబాయ్ ఒక దొంగ) అని సంజయ్ గాంధీని ఉద్దేశించి దూషించాడని ప్రియాంక తెలిపారు. ఆ మాట వినగానే తీవ్ర కోపంతో ఆ బాలుడి చెంప పగలగొట్టానని ఆమె చెప్పారు. దెబ్బ తిన్న ఆ పిల్లాడు ఏడుస్తూ టీచర్‌కు ఫిర్యాదు చేయడంతో, చివరకు తనకు చీవాట్లు పడ్డాయని ఆమె నవ్వుతూ గుర్తు చేసుకున్నారు.ఇదే క్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత తనకూ పాఠశాలలో క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయని వివరించారు. ఆ సమయంలో తరగతి గదిలో తన పక్కన కూర్చోవడానికి ఎవరూ ఇష్టపడలేదని తెలిపారు. అంతేకాకుండా, తన ఏడో పుట్టినరోజు వేడుకలకు స్నేహితులను ఆహ్వానించినప్పటికీ దాదాపు ఎవరూ రాలేదని ఆయన పేర్కొన్నారు.విద్యార్థులుగా తమ ఇద్దరి వ్యక్తిత్వాల మధ్య ఉన్న తేడాలను కూడా ఈ సందర్భంగా వారు వెల్లడించారు. తాను క్రమశిక్షణతో ఉంటూ, పాఠశాల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించే వ్యక్తినని, స్కూల్ ప్రిఫెక్ట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించానని ప్రియాంక చెప్పారు. మరోవైపు రాహుల్ మాత్రం తాను కాస్త తిరుగుబాటు ధోరణితో ఉండేవాడినని, ఉపాధ్యాయులను ఎక్కువగా ప్రశ్నలు అడుగుతూ క్లాస్‌లో కాస్త గందరగోళం సృష్టించేవాడినని సరదాగా అంగీకరించారు.కాగా, సోనియా గాంధీ రాసిన తాజా పుస్తకంలో ఎమర్జెన్సీ సమయంలో సంజయ్ గాంధీ పోషించిన పాత్ర, ఆ పరిణామాలపై ఇందిరా గాంధీలో కలిగిన భావనల వంటి పలు చారిత్రక కోణాలను స్పృశించారు. ప్రస్తుతం రాహుల్, ప్రియాంకల చిన్ననాటి ముచ్చట్లకు సంబంధించిన ఈ వీడియో నెట్టింట

కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలకు మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు



మంగళగిరి:పెన్ పవర్,నవంబర్, 24,

శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన పవిత్ర పర్వదినం కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్హృదయపూర్వకశభాకాంక్షలుతెలియజేశారు . ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలనునింపాలనిఆయనఆకాంక్షించారు.కార్తీక పౌర్ణమి హిందూ సంప్రదాయంలో విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పర్వదినమని, భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకునే ప్రజలందరికీ భగవంతుని ఆశీస్సులు లభించాలని కోరుకున్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం,సౌభాగ్యంవెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతోజీవించాలని ఆకాంక్షించారు.
ఈ పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీమరోసారిశభాకాంక్షలుతెలియజేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ అంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు కలెక్టర్ సి యం సాయికాంత్ వర్మ



గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 24:

మంగళగిరికార్పొరేషన్,పొన్నూరుమున్సిపాలిటీఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లాకలెక్టర్సియంసాయికాంత్వర్మతెలిపారు.మంగళవారంపట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపూనేఠవీడియోకాన్ఫరెన్స్సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.పట్టణస్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాల కవరేజీ ఏర్పాటు చేయాలనిసూచించారు.గతఎన్నికల అనుభవాలను దృష్టిలోఉంచుకొనికౌంటింగ్కేంద్రాల్లో అవసరమైన అదనపు టేబుళ్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.గతజిల్లాపరిషత్ఎన్నికలసమయంలో తుపానుప్రభావంతోభారీవర్షాలుకురిసినప్పటికీ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమర్థవంతంగా విధులు నిర్వహించారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అన్నారు.
గుంటూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ మంగళగిరి కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీలకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో అదనపు టేబుళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్కు వివరించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి సంక్షేమ హాస్టళ్ల ఆధునికీకరణ పూర్తి చేయాలి కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ



గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 24:

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల రూపురేఖలను మార్చి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'మార్పు' పథకం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.
మంగళవారం జిల్లా కలెక్టరేట్లో 'మార్పు' పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోవు డిసెంబర్ చివరి నాటికి హాస్టళ్ల ఆధునికీకరణ పనులకు సంబంధించి అవసరమైన అన్ని ఆర్థికపరమైన అనుమతులు పొందాలని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి జిల్లాలో గుర్తించిన సంక్షేమ హాస్టళ్లలో ఆధునిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు గ్రే వాటర్ మేనేజ్మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, సోక్ పిట్స్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. వ్యర్థ జలాల నిర్వహణ, ఘన వ్యర్థాల సక్రమ పారవేతకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పచ్చదనం పెంపులో భాగంగా హాస్టళ్ల ప్రాంగణాల్లో హెర్బల్ గార్డెన్స్, దోమల నివారణకు ఉపయోగపడే మస్కిటో రిపెల్లెంట్ గార్డెన్స్ ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన గార్డెన్స్ నిరంతరం నిర్వహణలో ఉండేలా వెంటనే మంచినీటి ట్యాప్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.మార్పు' పథకం లక్ష్యాలకు అనుగుణంగా అన్ని పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో సీపీఓ లక్ష్మి కుమారి, డ్వామా పీడీ శంకర్, పంచాయతీరాజ్ , ఆర్ అండ్ బి ఎస్ ఈ లు అశోక్, శ్రీనివాసమూర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి హరిత, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దుర్గాభాయి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి మయూరి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే పరిశీలనకు వచ్చిన అధికారులకు రైతుల నిరసన సెగ



విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 24,

హైదరాబాద్ నుంచి గొల్లపూడి బైపాస్ రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల పరిశీలన కోసం వచ్చిన వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు స్థానిక రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి ఎదురైంది. మంగళవారం నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులు.
ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.
అక్కడి నుంచి చిలుకూరు, పరిటాల గ్రామాల వరకు హైవే నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు.
అయితే, ఇన్ని శాఖల అధికారులు గ్రామాల్లోకి పరిశీలనకు వస్తున్నప్పుడు కనీసం గ్రామ రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత స్థానిక రెవెన్యూ అధికారులకు లేదా అంటూ రైతులు అధికారులపై మండిపడ్డారు.
ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు:
వరద ముప్పు ఆందోళన: తమ గ్రామాలకు ఏటా 20 సార్లకు పైగానే ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుందని, ఈ విషయం జిల్లా కలెక్టర్తో పాటు సంబంధిత అధికారులకు తెలియదా అని రైతులు ప్రశ్నించారు. వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకోకుండా పనులు చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.
పరిహారం చెల్లింపుల్లో జాప్యం: గతంలో పరిటాల గ్రామ రైతులకు రూ. 1.02 కోట్ల (కోటి రెండు లక్షలు) పరిహారం కేటాయించినప్పటికీ, అందులో కేవలం సగం నిధులు మాత్రమే రైతుల ఖాతాల్లో జమఅయ్యాయని మూలపాడు రైతులు అధికారులకు వివరించారు.
తమ సమస్యలకు స్పష్టమైన పరిష్కారం చూపి, పూర్తి స్థాయిలో న్యాయం చేసిన తర్వాతే పనులు ముందుకు తీసుకెళ్లాలని రైతులు అధికారులను డిమాండ్ చేశారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు కలెక్టర్ సి యం సాయికాంత్ వర్మ..



గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 24:

మంగళగిరి కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సి యం సాయికాంత్ వర్మ తెలిపారు.మంగళవారం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పూనేఠ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.
పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాల కవరేజీ ఏర్పాటు చేయాలని సూచించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన అదనపు టేబుళ్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.
గత జిల్లా పరిషత్ ఎన్నికల సమయంలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసినప్పటికీ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమర్థవంతంగా విధులు నిర్వహించారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అన్నారు.
గుంటూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ మంగళగిరి కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీలకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో అదనపు టేబుళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్కు వివరించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

మ్యాంగో స్ట్రీట్ ఆదర్శం.. గుంటూరులో ఇలాంటి వందలాది వీధులు రావాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి





గుంటూరు, పెన్ పవర్:నవంబర్, 24

గుంటూరులోని 54వ డివిజన్ పరిధిలో ఉన్న మ్యాంగో స్ట్రీట్ ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తోందని, నగరంలో ఇలాంటి వందలాది వీధులు అభివృద్ధి చెందాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు. మంగళవారం జేకేసీ రోడ్డులోని 54వ డివిజన్ మ్యాంగో స్ట్రీట్, ఎస్.వి.ఎన్. కాలనీలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మ్యాంగో స్ట్రీట్ వాసులు కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రతి కార్యక్రమంలో ఒకే కుటుంబంలా ఐక్యంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. పచ్చదనం, పరిశుభ్యం, చెత్త నిర్వహణతో పాటు స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ గుంటూరులో భాగంగా మ్యాంగో స్ట్రీట్ ఆదర్శ ప్రాంతంగా గుర్తింపు పొందడం సంతోషకరమన్నారు.
ఇక్కడి యువత, పెద్దలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పరిశుధ్యం, పచ్చదనం, సామాజిక బాధ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ నగర అభివృద్ధి, పరిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రజల భాగస్వామ్యంతో గుంటూరును మరింత అభివృద్ధి చేయవచ్చన్నారు.ప్రజాప్రతినిధులు,నాయకులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే నగర అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా, బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు. ప్రజల్లో చైతన్యం, ఐక్యత పెరిగితే గుంటూరులో మరిన్ని మ్యాంగో స్ట్రీట్లు ఏర్పడతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

గుంటూరులో అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
పనుల్లో వేగం.. నాణ్యతలో రాజీ వద్దు: నగర కమిషనర్ కె.మయూర్ అశోక్





గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 24:

గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను మరింత పటిష్టం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం నగరంలోని జియావుద్దీన్ నగర్, కపర్ది నగర్, ఆర్టీసీ కాలనీ, ఇజ్రాయిల్ పేట తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. తాగునీటి నమూనాలను సేకరించి నివేదికలను ఆన్లైన్తో పాటు రిజిస్టర్లలో నమోదు చేయాలని, పైప్లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు.
ఆర్టీసీ కాలనీలోని స్మృతివనం పార్కును అభివృద్ధి చేయాలని, మణిపురం వంతెన కింద ఉన్న ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
నూతన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి పనికి థర్డ్ పార్టీ నాణ్యతా ధ్రువీకరణ పొందాలని స్పష్టం చేశారు. నాణ్యతలో లోపాలు ఉంటే కాంట్రాక్టర్లతో పాటు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నగరంలో ఈ-ఆటోల ద్వారా వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, రూట్ మ్యాప్ ప్రకారం చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. రోడ్లు, డ్రైన్లపై చెత్త వేసే వ్యాపారులపై భారీ జరిమానాలు విధించాలని, ఖాళీ స్థలాల్లో చెత్త, పిచ్చిమొక్కలు తొలగించేలా యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు.
ఈ పర్యటనలో ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, ఈఈ డి.సుందర్రామిరెడ్డి, డీఈఈ హనీఫ్, ఎస్ఎస్ సాంబయ్య, కార్పొరేటర్ కె.పిచ్చిరెడ్డి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలి
రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ





విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 24,

మహిళలకుసురక్షితమైనవాతావరణం కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు.మహిళలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, ధర్మపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై విద్యార్థులకుఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శైలజ మాట్లాడుతూ, బాల్యం నుంచే పిల్లలకు మహిళలను గౌరవించే సంస్కారాన్నితల్లిదండ్రులునేర్పించాలనిసూచించారు. హింస అంటే కేవలం శారీరకమైనదే కాదని, ఆన్లైన్ ద్వారా జరుగుతున్న మానసిక వేధింపులు కూడా తీవ్రమైన నేరాలేనని పేర్కొన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన ఉండటం నేటి సమాజంలో అత్యవసరమని అన్నారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్, మహిళా పెట్రోలింగ్, 181 హెల్ప్లైన్, 112 అత్యవసర సేవలు, భరోసా కేంద్రాలనుఏర్పాటుచేయడంఅభినందనీయమన్నారు.
సభాధ్యక్షుడు ప్రొఫెసర్ త్రిమూర్తులు మాట్లాడుతూ, మహిళా చైతన్య కార్యక్రమాలను విద్యాసంస్థలకే పరిమితం చేయకుండా సామాన్య మహిళల వద్దకు కూడా తీసుకెళ్తామన్నారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ఆర్. శివరామ ప్రసాద్ మాట్లాడుతూ, మహిళలు ఆత్మవిశ్వాసంతో నిర్భయంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ప్రొఫెసర్ విమల మాట్లాడుతూ మహిళలు మానసికంగా బలోపేతం కావాలని సూచించారు. సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. భవాని మాట్లాడుతూ, విద్య మహిళా సాధికారతకు శక్తివంతమైన సాధనమని, ఆర్థిక స్వాతంత్ర్యంతో మహిళలు అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కోగలరని తెలిపారు.ధర్మపీఠం జాతీయ న్యాయ సలహాదారు గంటా సతీష్ కుమార్ మహిళల రక్షణకు ఉన్న చట్టపరమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై రూపొందించిన పరిశోధనా పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు ధర్మపీఠం అధ్యక్షుడు శెట్టిపల్లి శశికిరణ్ నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మహిళా ప్రొఫెసర్లు, మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సురేష్ కుమార్, ధర్మపీఠం కార్యవర్గ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూపేష్ గుప్తా ప్రచార ప్రభంజనం.. కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం!
ప్రజలే బలం.. గెలుపే లక్ష్యం.. రూపేష్ గుప్తా దూకుడు!

1వ, 47వ వార్డుల్లో పండగ వాతావరణంలో భారీ ఎన్నికల ర్యాలీ

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రూపేష్ గుప్తాకు ఘన స్వాగతం

47వ వార్డులో తిరుగులేని మెజారిటీ అందిస్తాం -- తోట కిషోర్, బెల్లంకొండ బాజీ

ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే అరవిందబాబు, చైర్మన్ అభ్యర్థి రూపేష్ గుప్తా







నరసరావుపేట, పెన్ పవర్, నవంబర్ 24:

నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. పట్టణంలోని 1వ, 47వ వార్డుల్లో మంగళవారం నిర్వహించిన భారీ ఎన్నికల ర్యాలీతో రాజకీయ సందడి నెలకొంది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో సాగిన ఈ ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నాగసారపు రూపేష్ గుప్తా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, చైర్మన్ అభ్యర్థి నాగసారపు రూపేష్ గుప్తాకు జనసేన నాయకులు, సైనికులు, తెలుగుదేశం కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. 47వ వార్డులో నాయకులు తోట కిషోర్, బెల్లంకొండ బాజీ రూపేష్ గుప్తాకు తిరుగులేని మెజారిటీ అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణుల నినాదాలు, ప్రజల ఆదరణతో ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

47వ వార్డులో భారీ ర్యాలీ.. 1వ వార్డులో ఇంటింటి ప్రచారం

47వ వార్డులోని భరంపేట ప్రాంతంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, చైర్మన్ అభ్యర్థి నాగసారపు రూపేష్ గుప్తా, జనసేన కౌన్సిలర్ అభ్యర్థి గొట్టిపాటి శివ పుల్లారావు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం 1వ వార్డులోని చంద్రబాబు నాయుడు కాలనీలో కూడా భారీ ర్యాలీ చేపట్టారు.

ఈ కార్యక్రమంలో 1వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి సింహాద్రి గంగాధరరావుతో కలిసి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

ర్యాలీ మార్గమంతా ప్రజలు పూలతో చైర్మన్ అభ్యర్థి నాగసారపు రూపేష్ గుప్తాకు, కౌన్సిలర్ అభ్యర్థులకు ఘన స్వాగతం పలికారు. మహిళలు, యువకులు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని తమ మద్దతు తెలిపారు.

ప్రతి గడపకు చేరి ప్రజల సమస్యలపై ఆరా

ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, చైర్మన్ అభ్యర్థి నాగసారపు రూపేష్ గుప్తా, కౌన్సిలర్ అభ్యర్థులు ఆయా ప్రాంతాల్లో గడపగడపకు వెళ్లి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

వార్డు అభివృద్ధికి రూపేష్ గుప్తా భరోసా

ప్రజలతో నేరుగా మమేకమైన రూపేష్ గుప్తా తాగునీటి సరఫరా, పారిశుధ్యం, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, అంతర్గత రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల సమస్యలపై స్థానికులతో చర్చించారు. ప్రజలు వివరించిన సమస్యలను శ్రద్ధగా వింటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా రూపేష్ గుప్తా మాట్లాడుతూ ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడమే తన లక్ష్యమని తెలిపారు. వార్డు అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలు మరింత బాధ్యతతో పనిచేయాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని తెలిపారు.ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నాయకత్వంలో సాగిన భారీ ర్యాలీ, ఇంటింటి ప్రచారంతో 1వ, 47వ వార్డుల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది. ప్రజలతో ఆప్యాయంగా మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుంటూ రూపేష్ గుప్తా సాగించిన ప్రచారానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో నాగసారపు సుబ్బరాయ గుప్తా, భారతీయ జనతా పార్టీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై నల్లపాడు పోలీసుల ఉక్కుపాదం

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 24,

నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరాలపై పోలీసులు కొరడా ఝళిపించారు. బైపాస్ రోడ్డులోని సాక్షి పేపర్ కార్యాలయం పక్కన, జనతా కోల్డ్ స్టోరేజ్ వెనుక డొంక రోడ్డులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో నల్లపాడు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి, 6 సెల్‌ఫోన్లు, రూ. 21,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. నల్లపాడు పోలీసుల సమన్వయంతో నిర్వహించిన ఈ దాడి పేకాట నిర్వాహకుల్లో కలకలం



రేపింది. తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి
అధికారులకు కార్పొరేటర్ ఆళ్ళ శిరీష ఆదేశాలు



గుంటూరు, పెన్ పవర్:నవంబర్, 24,

గుంటూరు నగరంలోని 30వ డివిజన్ పరిధిలోని గుండారావుపేటలో మంగళవారం డివిజన్ కార్పొరేటర్ ఆళ్ళ శిరీష పర్యటించి స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాల్సిన సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా క్రిస్మస్ మాసం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పరిసరాలను



పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా రోడ్లు, సైడ్ కాలువలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు వివరించారు.

తనను కూటమి తరఫున డివిజన్ కార్పొరేటర్‌గా గెలిపించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆళ్ళ శిరీష ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రపంచ నగరాల మేయర్ల సదస్సుకు గుంటూరు మేయర్, కమిషనర్



గుంటూరు, పెన్ పవర్, నవంబర్ 24:

ముంబైలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న మూడవ ప్రపంచ నగరాల మేయర్ల సదస్సులో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ పాల్గొననున్నారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ కమిషనర్, సంచాలకులు డాక్టర్ పి. సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్థానిక స్వపరిపాలన సంస్థల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పట్టణాభివృద్ధిలో మహిళా



నాయకత్వం, లింగ సమానత్వం, ఆర్థిక అవకాశాలు, శిక్షణ, పరిశోధన, సంస్థాగత అభివృద్ధి, సమర్థవంతమైన నగర పాలన వంటి అంశాలపై ఇందులో చర్చించనున్నారు.ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన మేయర్లు, నగర నాయకులు, విధాన రూపకర్తలు, విద్యావేత్తలు, పట్టణాభివృద్ధి నిపుణులు, అభివృద్ధి సంస్థల ప్రతినిధులు కలిపి వెయ్యి మందికి పైగా హాజరుకానున్నట్లు అంచనా. ఈ నెల 27న పట్టణాభివృద్ధిలో మహిళా నాయకత్వం, లింగ సమానత్వం, ఆర్థిక అవకాశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 25 మంది మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కమిషనర్లను ఈ సదస్సులో పాల్గొనేందుకు పురపాలక పరిపాలన శాఖ ఎంపిక చేసింది.

ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తను తయారు చేయడమే చంద్రబాబు లక్ష్యం..ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 24

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలుగళ్ళా మాధ మంగళవారం మంగళగిరిలోని టీడీపీజాతీయకార్యాలయంలోమీడియాతోమాట్లాడుతూ కూటమిప్రభుత్వంసంక్షేమం,అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌భరోసాపింఛన్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సాధారణ పింఛన్లను రూ. 4,000కు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 6,000కు, దివ్యాంగులకు రూ. 10,000కు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ. 15,000కు పెంచి ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు.ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించడం



ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. రానున్న ఐదేళ్లలో పింఛన్ల కోసం సుమారు రూ. 1.70 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.మహిళా సాధికారత, సంజీవని, పి4 కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యవంతంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

వైసీపీకి సవాల్: 2029లో అధికారంలోకి వస్తామని చెబుతున్న వైసీపీ నాయకులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను అదే విధంగా కొనసాగించే ధైర్యం ఉందా అని గళ్ళా మాధవి ప్రశ్నించారు. చంద్రబాబు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని ఆలోచిస్తుంటే, జగన్ ప్రతి గల్లీకి ఒక గూండాను తయారు చేయాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు:పెన్ పవర్, నవంబర్, 24,

నల్గొండ జిల్లాలో రేపటి నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) జాతీయ మహాసభలు, వ్యవసాయ ప్రదర్శనను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పీరా రావు భవన్‌లోని రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అజయ్ కుమార్ మాట్లాడుతూ 1936లో స్థాపించబడిన ఏఐకేఎస్ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు రైతుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. భూ పోరాటాలు, గిట్టుబాటు ధరలు, బ్యాంకు రుణాలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. ఢిల్లీ రైతు ఉద్యమంలో 540 రైతు సంఘాలను ఐక్యం చేయడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి వాటిని వెనక్కి తీసుకునేలా చేసిందని పేర్కొన్నారు.

సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త ఎన్. వేణుగోపాలరావు మాట్లాడుతూ వ్యవసాయ భూములు, విత్తన రంగాన్ని కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పరిశోధనలకు తగిన బడ్జెట్ కేటాయించాలని, విత్తన రంగాన్ని ప్రభుత్వ రంగంలో బలోపేతం చేయాలని కోరారు.

కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు పాశం రామారావు మాట్లాడుతూ రైతు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నల్గొండలో జరిగే జాతీయ మహాసభల్లో వ్యవసాయ రంగ పరిరక్షణకు అవసరమైన చర్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన ప్రదర్శన స్టాళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ పాల



రైతుల సంఘం జిల్లా అధ్యక్షురాలు పర్వతం శివపార్వతి మాట్లాడుతూ పాడి పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాడి, పంట రంగాలు అభివృద్ధి చెందితేనే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలరని పేర్కొన్నారు. సహకార సంఘాలను బలోపేతం చేసి పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, విదేశాల నుంచి పాల ఉత్పత్తుల దిగుమతులను విరమించుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె. ముత్యాలరావు, యువజన సంఘం నాయకులు కె. కృష్ణకాంత్, విద్యార్థి సంఘ నాయకులు సయ్యద్ సమీర్, అనురాధ, రైతు సంఘం నాయకులు పోపూరి సుధీర్, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ఉత్సవాల్లో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పట్టణాభివృద్ధిలో మహిళా నాయకత్వం, లింగ సమానత్వం, ఆర్థిక అవకాశాలు, శిక్షణ, పరిశోధన, సంస్థాగత అభివృద్ధి, సమర్థవంతమైన నగర పాలన వంటి అంశాలపై ఇందులో చర్చించనున్నారు.

ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన మేయర్లు, నగర



నాయకులు, విధాన రూపకర్తలు, విద్యావేత్తలు, పట్టణాభివృద్ధి నిపుణులు, అభివృద్ధి సంస్థల ప్రతినిధులు కలిపి వెయ్యి మందికి పైగా హాజరుకానున్నట్లు అంచనా. ఈ నెల 27న పట్టణాభివృద్ధిలో మహిళా నాయకత్వం, లింగ సమానత్వం, ఆర్థిక అవకాశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 25 మంది మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కమిషనర్లను ఈ సదస్సులో పాల్గొనేందుకు పురపాలక పరిపాలన శాఖ ఎంపిక చేసింది.

అమరావతి రోడ్డుపై ఆక్రమణల తొలగింపు
కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన
టౌన్ ప్లానింగ్ అధికారులు



గుంటూరు: పెన్ పవర్, నవంబర్, 24,

గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డుపై ఆక్రమణల తొలగింపునకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందితో కలిసి రోడ్డుపై ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, ఇతర ఆక్రమణలను తొలగించారు. రహదారి విస్తరణకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు.

అమరావతి రోడ్డులో రోజురోజుకూ ఆక్రమణలు పెరిగిపోతుండటంతో రహదారి వెడల్పు తగ్గి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. తోపుడు బండ్లు రోడ్డుపైనే ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యపై దృష్టి సారించిన నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణల తొలగింపు



చేపట్టారు.

అమరావతి రోడ్డుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

నగరంలో వీఐపీల రాకపోకలు ఉండే ప్రాంతాలకే కాకుండా అన్ని ప్రధాన రహదారులపై అధికారులు సమానంగాదృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా అమరావతి రోడ్డులో ఆక్రమణల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా రమేష్ గారు ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మళ్లీ ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

అధికారులు ప్రస్తుతం చేపట్టిన తొలగింపు చర్యలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ తోపుడు బండ్లు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రహదారిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

1,23,714 మంది ఓటర్లకు మరో అవకాశం.. రాజకీయ పార్టీలు సహకరించాలి కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





విజయవాడ, పెన్ పవర్, నవంబర్ 24:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 1,23,714 మంది ఏఎస్‌డీఈ ఓటర్లకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ చేపట్టి, డిసెంబర్ 10లోగా వాటిని పరిశీలించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్ఐఆర్ సవరించిన షెడ్యూల్‌పై వివరించారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులైన ఓటర్లు సద్వినియోగం చేసుకునేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.అలాగే కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను దోషరహితంగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డిసెంబర్ 23న ముసాయిదా జాబితా ప్రచురించి, జనవరి 12 వరకు కొత్త ఓటరు నమోదు దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. వాటిని పరిష్కరించిన అనంతరం 2027 ఫిబ్రవరి 2న తుది జాబితా ప్రకటిస్తామన్నారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే అర్హత తేదీ 2026 నవంబర్ 1 నాటికి గత ఆరేళ్లలో కనీసం మూడేళ్లు ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి ఉండాలని తెలిపారు. ఫుల్‌టైమ్, అడహాక్ ఉపాధ్యాయులు అర్హులని, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి అర్హత లేదని స్పష్టం చేశారు. అర్హులు ఆన్‌లైన్ లేదా ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.మరిన్ని వివరాలకు కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం 91549 70454 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాల్లో జిల్లా స్థాయి కమిటీ తనిఖీలు

దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలి జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 24,

విజయవాడలోని కృష్ణలంక, విశాలాంధ్ర రోడ్, గవర్నర్‌పేట గోపాలరెడ్డి నగర్ ప్రాంతాల్లో ఉన్న ప్రజ్వల బాలికల హోమ్, శిశు గృహం, బాలసదనాలను జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. శిశు గృహంలో చిన్నారులకు అందిస్తున్న వైద్యం, ఆహారం, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని, దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. బాలసదనంలో బాలికల విద్య, పాఠశాలకు వెళ్లే విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. బాలలకు దుస్తులు, స్టడీ



మెటీరియల్, ఆట వస్తువులు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. మెనూ ప్రకారం ఆకుకూరలు, కూరగాయలు, ప్రోటీన్లు కలిగిన పోషకాహారం అందించాలని, కిచెన్, స్టోర్ రూమ్‌లు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జువైనల్ జస్టిస్ చట్ట నిబంధనల ప్రకారం రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, బాలలు ఆటలు ఆడుకునేందుకు అవసరమైన స్థలం కల్పించాలని సూచించారు. బాలలతో ముఖాముఖి మాట్లాడి వారి సదుపాయాలను తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని బాలికలను ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి సుల్తానాబేగం, డీసీపీవో ఎం.రాజేశ్వరరావు, జువైనల్ జస్టిస్ సభ్యురాలు బి.పుష్పలత, డా.అమితా, డా. సురేష్, ప్రభాకర్, దుర్గ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు..మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, పెన్ పవర్, నవంబర్ 24:

కాకినాడ జిల్లా ఉప్పాడలోని సుబ్బంపేట గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.సుబ్బంపేటకు చెందిన గరికాని సింహాద్రి బోటుతో పాటు మరో పడవ ఈ నెల 4న చేపల వేటకు ఒడిశాలోని పారాదీప్ వైపు వెళ్లాయని, రెండు పడవల్లో ఒకటి ఈ నెల 18న తిరిగి రాగా, మరో బోటు ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు 19న కోస్ట్‌గార్డ్‌కు ఫిర్యాదు చేయగా, వెంటనే మత్స్యశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టాలని కోరినట్లు వివరించారు.కాకినాడ, పారాదీప్ కోస్ట్‌గార్డ్ విభాగాలు, చెన్నైలోని మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ సమన్వయంతో అన్వేషణ కొనసాగుతోందన్నారు. తుఫాను ప్రభావంతో బోటు దారి తప్పి ఇతర దేశాల సముద్ర జలాల్లోకి వెళ్లి ఉండవచ్చనే అనుమానంతో బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకు కూడా సమాచారం అందించినట్లు తెలిపారు.గల్లంతైన బోటులో 1,500 లీటర్ల డీజిల్, 30 రోజులకు సరిపడా ఆహార పదార్థాలు ఉన్నాయని, మత్స్యకారులు క్షేమంగా ఉంటారనే ఆశాభావం వ్యక్తం చేశారు. సోరాడ కొండల్రావు, గుంపల ప్రకాశు, తిర్రి నారాయణ, సోరాడ చిన్న, మెరుగు నారాయణ, కండల రాము ఆచూకీ కోసం అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.మత్స్యకారుల కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. ఆరుగురినీ సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీపారాధన ఆలయ శుభ్రత





సత్తెనపల్లి, పెన్ పవర్:నవంబర్, 24,

సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఉన్న శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు దీపారాధన నిర్వహించిన అనంతరం ఆలయాన్ని శుభ్రం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుబ్బారావు మాట్లాడుతూ కార్తీక మాసంలో క్షీరాబ్ధి ద్వాదశి, కార్తీక పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి రోజున జ్వాలా తోరణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఈ మాసంలో చేసే శివారాధన సర్వపాపహరమని, కార్తీక పౌర్ణమి అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన పర్వదినమని పేర్కొన్నారు. కార్తీక మాసంలో నిర్వహించే ఆధ్యాత్మిక ఉపాసనల్లో కార్తీక పౌర్ణమికి విశేష ప్రాశస్త్యం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, ఫౌండేషన్ సభ్యులు, భక్తులు, స్కిల్ హబ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల వ్యయాలపై నిరంతర నిఘా ఉంచాలి ఎన్టీఆర్ జిల్లా వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 24,

ఎన్టీఆర్ జిల్లాలో రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్ మంగళవారం జూమ్ ద్వారా వ్యయ పర్యవేక్షణ బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.చందర్లపాడు,జగ్గయ్యపేట,కంచికచర్ల, నందిగామ,పెనుగంచిప్రోలు,వత్సవాయి, వీరులపాడు మండలాల సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్, ఎఫ్ ఎస్ టి., ఎస్ ఎస్ టి., బృందాల నాయకులు పాల్గొన్నారు. నవంబర్ 29న జిల్లాలోని 138 గ్రామ పంచాయతీలు, 1,432 వార్డులలో రెండవ దశ పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అన్ని బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పరిశీలకులు ఆదేశించారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు షాడో పరిశీలన రిజిస్టర్లు ప్రారంభించి, వారి ఎన్నికల వ్యయాలను నమోదు చేయాలి. అభ్యర్థులు ప్రతి మూడు రోజులకు ఒకసారి



పోచర్లు, బిల్లులతో సహా వ్యయ వివరాలను సమర్పించాలి. లెక్కలు సమర్పించని అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఎఫ్ ఎస్ టి., ఎస్ ఎస్ టి., బృందాలు సభలు, ర్యాలీలు, వాహనాలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లు, ఆహారం తదితర ప్రచార ఖర్చులను నమోదు చేసి, ప్రతిరోజూ అకౌంటింగ్ బృందాలకు నివేదికలు పంపాలి. నగదు, మద్యం, కానుకలు లేదా ఇతర ప్రలోభాల పంపిణీ గుర్తించిన వెంటనే అధికారులకు తెలియజేయాలి. ప్రింట్, ఎలక్ట్రానిక్, కేబుల్, సోషల్ మీడియాలో ప్రచురితమయ్యే చెల్లింపు వార్తలు, స్పాన్సర్డ్ రాజకీయ ప్రకటనలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. ఆధారాలతో సహా పరిశీలకులకు నివేదించాలి. సభలు, ర్యాలీలు, వాహనాలు, లౌడ్‌స్పీకర్లు తదితర ప్రచార కార్యక్రమాలకు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలి. అనుమతి లేని కార్యక్రమాలను వెంటనే నివేదించాలని ఆదేశించారు. సహాయ వ్యయ పరిశీలకులు తమ మండలాల్లోని బృందాల పనితీరును పర్యవేక్షిస్తూ, రిజిస్టర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించి, తనిఖీలకు అందుబాటులో ఉంచాలి.

ఎన్నికల వ్యయ పర్యవేక్షణలో పారదర్శకత, సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆదేశించారు.

బుర్రిపాలెంలో కూటమి విజయభేరి.. సర్పంచ్‌గా జెట్టి భారతి ఏకగ్రీవ ఎన్నిక

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 24,

తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. సర్పంచ్‌గా కూటమి బలపరిచిన జెట్టి భారతి ఏకగ్రీవంగా ఎన్నికవగా, ఉపసర్పంచ్‌గా పరుచూరి రాంబాబు ఎన్నికయ్యారు.గ్రామంలోని మొత్తం 12 వార్డులకు గాను తెలుగుదేశం పార్టీ 8, జనసేన పార్టీ 3 వార్డులను కైవసం చేసుకోగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక వార్డును దక్కించుకుంది. దీంతో గ్రామంలో కూటమి స్పష్టమైన ఆధిపత్యాన్ని చాటుకుంది. విజయంతో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా నూతన సర్పంచ్ జెట్టి భారతి మాట్లాడుతూ, ఈ విజయం గ్రామ ప్రజలు అందించిన ఆశీర్వాదమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మద్దతుతో ఈ విజయం సాధ్యమైందన్నారు. రాబోయే ఐదేళ్లలో బుర్రిపాలెం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఉపసర్పంచ్ పరుచూరి రాంబాబు మాట్లాడుతూ, గ్రామ



ప్రజల ఐక్యతకు, కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి ఈ ఏకగ్రీవ విజయం నిదర్శనమని అన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నూతన పాలకవర్గం సమష్టిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి వినోద్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు దివ్య మధుబాబు, పలువురు దళిత నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రతిదశలోనూ అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 24,

జిల్లాలోపంచాయతీఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ,ఎన్నికలవ్యయపరిశీలకులుబి.విజయకుమార్ తో కలిసి కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ వీసీ అనంతరం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు తదితర అంశాలపై కలెక్టర్ లక్ష్మీశ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలిదశలో ఈ నెల 26న 73 గ్రామ పంచాయతీల్లో 856 వార్డులకు 1,001 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. తొలిదశలో విజయవాడ రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి జి.కొండూరు మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో 224 వార్డులకుఎన్నికలుజరగనున్నాయన్నారు. ఇదేవిధంగా ఇబ్రహీంపట్నంమండలంలో10 గ్రామ పంచాయతీల్లో 116 వార్డులకు, మైలవరం మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో 154 వార్డులకు, విజయవాడ గ్రామీణ మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో 226 వార్డులకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. తిరువూరు రెవెన్యూ డివిజన్ రెడ్డిగూడెం మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో 136 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ ఉంటుందని.. మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్, ఫలితాల వెల్లడి జరుగుతుందన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని.. అప్పుడే ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆసాంతం సాఫీగా జరుగుతుందన్నారు. సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల





ప్రక్రియను పర్యవేక్షించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేపట్టి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలను సమన్వయం చేసుకోవాలన్నారు. తొలిదశ ఎన్నికలకు ఏర్పాటు చేసిన అయిదు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

40 ఏళ్ల రాజకీయ అనుభవంతో గూడూరు అభివృద్ధికి కృషి చేస్తా: వీరంకి సుబ్రహ్మణ్యం

గూడూరు, పెన్ పవర్, నవంబర్ 24

40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో గూడూరు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కూటమి బలపరిచిన జనసేన సర్పంచి అభ్యర్థి వీరంకి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని వివిధ వీధుల్లో ఇంటింటికీ పర్యటించి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానన్నారు. తనకు సర్పంచి అభ్యర్థిగా అవకాశం కల్పించిన మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ సుబ్రహ్మణ్యంకు ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవం గ్రామాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రజలు ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు



అన్నం హరిరాం, ఎంపీటీసీ పోతన రామోజీ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్ఏ బేగ్, మండల పార్టీ కార్యదర్శి యారా ప్రసాద్, గూడూరు జనసేన యువ నాయకుడు పుప్పాల కిరణ్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు బాసింశెట్టి విజయ్, మాగంటి నాగరాజు, రావి సత్యనారాయణ, బేతాళ స్వామి, అమరారపు సుబ్బారావు, పోతన బాబి, శీలం పవన్ కళ్యాణ్, దావు నాని, కే. నరసింహారావు, అయ్యప్ప, యూసఫ్ ఖాన్, వీర్రాజు, వార్డు సభ్యురాలు చింతా దుర్గాభవాని తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనవరి 1, 2027 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 24,

జనవరి 1, 2027 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశం మందిరం నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన ప్రాజెక్ట్ సంజీవని' జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అమలు, వివిధ శాఖల పాత్రలు, బాధ్యతలు, పౌరుల నమోదు, ఆరోగ్య సేవల అనుసంధానం, శిక్షణ కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రాజెక్టు ప్రారంభ దశలోనే జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని కలెక్టర్ ఆదేశించారు. 'నో యువర్ సిటిజన్' కార్యక్రమం ద్వారా పౌరుల వివరాలను 'కేర్-ఎక్స్' పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ నమోదు ప్రక్రియలో పౌరుల ఆరోగ్య గుర్తింపు సంఖ్య (అభా ఐడీ), మొబైల్ నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. రెండు దశల్లో ఈ నమోదు ప్రక్రియ చేపట్టాలని, మొదటి దశలో ఇప్పటికే ఆరోగ్య గుర్తింపు సంఖ్య కలిగిన వారిని, రెండో దశలో ఆరోగ్య గుర్తింపు సంఖ్య లేని వారిని నమోదు చేయాలని ఆదేశించారు.ప్రాజెక్ట్ సంజీవనిలో భాగంగా మొత్తం 12



రకాల సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను అనుసంధానం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు, సాంకేతిక ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రాజెక్టు అమలు పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక సమాచార పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో భాగంగా సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు, పౌరుల నమోదు పురోగతి, ప్రాజెక్టు అమలు తీరును ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ సంజీవని లక్ష్యాలను నిర్దీత గడువులోగా సాధించేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాటా ఎండీ సంస్థ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

డిసెంబర్ 10 నాటికి జిల్లా స్థాయిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, జనవరి 1, 2027 నుంచి ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసేందుకు ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, కమిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ ఎ.శ్రవణ బాబు, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.ఇందుమతి దేవి, జిల్లా ప్రాజెక్ట్ సంజీవని నోడల్ అధికారి డాక్టర్ పి.నవీన్, ఆరోగ్య కేంద్రాల నోడల్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణి, డిపిఎం వి.మహేశ్వర రావు, విజయవాడ ఆర్డీఓ వెన్నెల శ్రీను, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖ అధికారి కె.వి.ఎస్.ఆర్.రవికుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.ఎన్.వి. నాంచారరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ, ఏపీఎంఎస్ఐడీసీ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.ఎ. రవీంద్ర, టాటా ఎండీ సంస్థ జిల్లా ప్రతినిధి సుష్మ మరిత డిసౌజా, అమలు నిపుణులు ఎన్.వి.వి. సత్యనారాయణ, పి. గోపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

4 వ ర్యాంకింగ్ చెస్ పోటీల యందు అత్యంత ప్రతిభ కనబరచి శ్రీ శాంతినికేతన్ సీబీఎస్ఈ స్కూల్



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 24

నంద్యాల క్రాంతి నగర్ లోని శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించిన జిల్లా స్థాయి 4 వ ర్యాంకింగ్ చెస్ పోటీల యందు అత్యంత ప్రతిభ కనబరచి ఉత్తమ బహుమతులను కైవసం చేసుకున్నారు. యు-10 విభాగంలో నాలుగవ తరగతికి చెందిన ఇషాని నాలుగవ స్థానాన్ని దక్కించుకోగా, అదే తరగతికి చెందిన ఎస్ భరత్ ఐదవ స్థానాన్ని దక్కించుకున్నాడు అలాగే యు-16 విభాగంలో 9వ తరగతికి చెందిన యజ్ఞచరణ్ ద్వితీయ బహుమతిని, ఎరసుమంత్ తృతీయ బహుమతిని, మహేంద్ర చతుర్థ స్థానాన్ని, మధు సుదర్శన్ 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు ఈ సందర్భంగా విజేతలకు శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ సూర్యదేవర సుధాకర్ తమ పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు చదువుతోపాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి , విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడతాయని తెలియజేశారు ఇలాంటి క్రీడల వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరగడమే గాక విశ్లేషణ పైన సంపూర్ణ అవగాహన ఏర్పడుతుందని తెలియజేశారు ఈ సందర్భంగా విద్యార్థులకు ఉత్తమ శిక్షణను ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

8 మండలాల్లో 107 గ్రామ పంచాయతీలు, 975 వార్డులకు నవంబర్ 26న పోలింగ్

పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయసంఘటనలకుతావులే కుండాముందస్తుచర్యలుఎన్నికలసన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠకు వివరించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 24 :-

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నవంబర్ 26వ తేదీన నిర్వహించనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో,పారదర్శకంగానిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠకు వివరించారు.

మంగళవారం అమరావతిలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా పంచాయతీ అధికారి ఫణికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 26న జరగనున్న మొదటి విడత ఎన్నికల్లో జిల్లాలోని 8 మండలాల పరిధిలో 107 గ్రామ పంచాయతీలు, 975 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది నియామకం, విధుల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర ఏర్పాట్లు



పూర్తి చేసినట్లు వివరించారు.

ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఎన్నికల నియమావళి అమలుతో పాటు పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేలా సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.

ఓటర్ మ్యాన్ కాదు.. రిగ్గింగ్ మ్యాన్ చంద్రబాబుపై మాజీ మంత్రి విడదల రజిని తీవ్ర విమర్శలు.

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 24 :

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం బీహార్‌ను మించిన అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి విడదల రజిని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చిలకలూరిపేటలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ అప్రజాస్వామికంగా జరుగుతోందని ఆరోపించారు.

ప్రభుత్వం, అధికారులపై ఆరోపణలు..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఓటర్ మ్యాన్' కాదని, 'రిగ్గింగ్ మ్యాన్' అని విడదల రజిని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో బూత్ క్యాప్చరింగ్‌లకు పాల్పడుతూ ప్రజాతీర్పును తారుమారు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), పోలీసులు, ప్రభుత్వ అధికారులు పక్షపాతంతో టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు.పల్నాడు జిల్లాలో రాజ్యాంగం



కాకుండా 'రెడ్‌బుక్ రాజ్యాంగం' అమలవుతోందని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియపై ఆగ్రహం..చిలకలూరిపేట చరిత్రలో తొలిసారిగా హైకోర్టు అనుమతితో నామినేషన్లువేయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని విడదల రజిని అన్నారు. ఎన్నికల పేరుతో నియోజకవర్గంలో గూండాయిజం, రౌడీయిజం సాగుతోందని ఆరోపించారు. జడ్పీటీసీ అభ్యర్థులను బెదిరించి, కిడ్నాప్ చేసి బలవంతంగా నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేస్తున్నారని, అభ్యర్థులను గృహనిర్బంధం చేసి దాడులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసుల తీరుపై ప్రశ్నలు..నాదెండ్లకు వెళ్తున్న తనను పోలీసులు అడ్డుకున్న తీరును నిరసిస్తూ ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. అలాగే, తిమ్మాపురం ఘటనలో హత్యాయత్నం (సెక్షన్ 307) కేసు నమోదైన నిందితులకు పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చి ఎలా పంపిస్తారని ఆమె ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై జిల్లా ఏఎస్పీ సమాధానం చెప్పాలని విడదల రజిని డిమాండ్ చేశారు.

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా మార్చడమే ధ్యేయం ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 24,

ఇది డబుల్ ఇంజన్ సర్కారు కాదని.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో కూడి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బాగా బుద్ధి చెప్పారని చెప్పారు. గతంలో ఈవీఎంలపై తమ ఓటమి నెపాన్ని నెట్టిన వైసీపీ .. ఇప్పుడు బ్యాలెట్ పోరులోనూ బొక్కా బోర్లా పడిందని తెలిపారు. ఇప్పుడు ఫలితాలను చూసి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సోషల్ ఇంజినీరింగ్ పేరిట జగన్ హయాంలో బీసీల రిజర్వేషన్ ను 24 శాతానికి తగ్గించి 16,800 మందికి రాజ్యాంగ పదవులు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. కోర్టులో బీసీల రిజర్వేషన్లపై అడ్డంకులు ఎదురైనప్పటికీ టీడీపీ 34 శాతం అభ్యర్థులకు టికెట్లు ఇచ్చిందనన్నారు. అదే సమయంలో విద్యావంతులతోపాటు మహిళలకు 50 శాతం టికెట్లు అందించి గౌరవించినట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లోనూ గ్రామీణ ప్రజలు కూటమికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం అధిగమించి ప్రజలకు మంచి చేస్తున్నారని చెప్పారు. ఎల్ నినోతోపాటు రెండు తుఫాన్ల సమయంలోనూ ప్రజలకు కూటమి అండగా నిలిచిందన్నారు. ఐక్యతకు మారుపేరు కూటమి నాయకత్వమని, అందుకే ప్రత్యర్థి పార్టీ రాష్ట్రంలో అడ్రస్ గల్లంతు అవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కేవలం అక్షర క్రమంలోనే కాదు.. అభివృద్ధిలోనూ నంబర్ వన్ స్థానంలో నిలవబోతోందని, రాష్ట్రానికి స్వర్ణయుగం రాబోతోందని చెప్పారు. జగన్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల ఛీకొట్టారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అమరావతి రాజధాని నిర్మాణం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు పరుగులు తీస్తున్నాయని తెలిపారు. యువత భవితను బంగారుమయం చేసేందుకుగాను రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల్లో 17 వేల మంది వైసీపీ తరపున పోటీలో నిలిచారని, అయితే ప్రజలు కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందించారని తెలిపారు. తల్లికి వందనం, దీపం పథకం, స్త్రీశక్తి పథకం వంటి కార్యక్రమాలతో పేదలకు సంక్షేమాన్ని అందించామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలనతో పంచాయతీలకు మహర్దశ వచ్చిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నామని తెలిపారు.

తాడిగడప మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థులను గెలిపించాలి ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు షేక్ సలావుద్దీన్

పెనమలూరు, పెన్ పవర్, నవంబర్, 24,

పెనమలూరు నియోజకవర్గంలోని తాడిగడప మున్సిపాలిటీలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు షేక్ సలావుద్దీన్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు... అనంతరం తాడిగడప మున్సిపాలిటీలోని నాలుగు గ్రామాలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేసిన అభివృద్ధి పనులను స్థానిక ఓటర్లు గుర్తు చేసుకోవాలని.... అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి సిసి రోడ్ల నిర్మాణం మరియు డ్రైనేజీ నిర్మాణంలో తాడిగడప మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలిపారని కొనియాడారు... అనంతరం కూటమి పార్టీ తరపున పోటీ చేస్తున్న కూటమి చైర్మన్ అభ్యర్థికి మరియు డివిజన్లోని కౌన్సిలర్ అభ్యర్థులకు అఖండ మెజారిటీతో గెలిపించి తాడిగడప మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో నడపడానికి స్థానిక ఓటర్లు ప్రజానీకం ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.....ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పటి నుంచి తర్వాత అప్పటి అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాం గడిచిన తర్వాత వైఎస్ఆర్సిపి పార్టీ అధికారం చేపట్టి కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలో తాడిగడప మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు...దీనిలో భాగంగా కానూరు గ్రామం, యనమలకుదురు గ్రామం, పోరంకి గ్రామం మూడిటిని కలుపుతూ తాడిగడప మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు...తాడిగడప మున్సిపాలిటీ ఏర్పడి ఆరేళ్లు



గడిచినప్పటికీ కేవలం అధికార యంత్రాంగ మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తుంది.. అధికారిక అనుమతులు మరియు కార్యకలాపాలకు మేజర్ బాధ్యతలు అన్నీ మున్సిపల్ కమిషనర్ నిర్వహిస్తున్నారు.... తాడిగడప మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా కూటమి పార్టీ తరపున పీతా గోపీచంద్ కు సీటును కేటాయించడం జరిగింది గతంలో టిడిపి పార్టీకి విధేయుడుగా మరియు చంద్రబాబు అరెస్టు సమయంలో కూడా నియోజకవర్గంలో ఉద్యమాలు చేయడంలో స్థానికంగా కీలక పాత్ర పోషించారు మరియు కూటమి పార్టీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవుల్లో భాగంగా పీతా గోపీచంద్ చేసిన సేవలు గాను అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని అప్పగించింది... స్థానికంగా ఉన్న నాయకులతో మంచి సంబంధాలు ఉండటం పీతా గోపీచంద్ కు కలిసి వచ్చే అంశం ...ప్రధానంగా తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి దాదాపు రూ" 250 కోట్లు మేర వెచ్చించి రోడ్లు లేని ప్రాంతాల్లో సిసి రోడ్లు వేయడం మరియు డ్రైనేజీ నిర్మించడంలో ప్రజల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ కలిసి వచ్చే అంశం!! ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణంతో ఎంతగానో ఉపసమనం లభించింది....

అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్పీ....

మృతుడికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాన్ ఐపీస్ ..

ఎన్ పవర్, నవంబర్, 24,

నంద్యాల పట్టణంలోని రెండవ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు (హెచ్.సి 720) అనారోగ్య కారణాలతో ఉదయానంద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ నేడు ఉదయం మృతి చెందారు.హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు మృతి చెందిన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాన్ ఐపీస్ రైతునగరంలోని ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ పెద్దను కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొంటూ వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, పోలీసు కుటుంబ సంక్షేమం కోసం జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పోలీస్ శాఖ తరపున ఏ విధమైన సహాయం



అవసరమైనా తనను లేదా సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరి కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

బొత్స వర్సెస్ చిన్న శ్రీను.. చీపురుపల్లిలో డైరెక్ట్ ఫైట్





చీపురుపల్లి రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ, చిన్నశ్రీను మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. గత పరిషత్ ఎన్నికలకు దూరంగా ఉన్న చిన్నశ్రీను ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. చీపురుపల్లి, కొండపాలెం మేజర్ పంచాయతీలను రెండు వర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో స్థానిక పోరు వేడెక్కింది.

ఉత్తరాంధ్రలో అత్యంత కీలక నియోజకవర్గమైన చీపురుపల్లిలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, టీడీపీ కీలక నేత, జడ్పీ మాజీ చైర్మన్ చిన్న శ్రీను మధ్య రాజకీయ పోరు ఉత్కంఠ రేకెత్తిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఇద్దరు ముఖాముఖి పోటీ చేస్తారో లేదో కానీ ప్రస్తుతం ఒకరిపై ఒకరు పైచేయి సాధించేలా వ్యూహరచన చేస్తున్నారు. జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల సమయంలో బొత్స సొంత నియోజకవర్గం చీపురుపల్లికి దూరంగా ఉన్న చిన్నశ్రీను ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను సవాల్ గా తీసుకోవడమే ఆసక్తి రేకెత్తిస్తోందని అంటున్నారు.

దాదాపు రెండున్నర దశాబ్దాలుగా చీపురుపల్లి కేంద్రంగా బొత్స, చిన్న శ్రీను రాజకీయాలు చేస్తున్నారు. బొత్స అడుగు జాడల్లో ఇన్నాళ్లు నడిచిన చిన్నశ్రీను ఇప్పుడు సొంత బలం నిరూపించుకునే పనిలో పడ్డారు. అయితే ప్రస్తుతం చీపురుపల్లిలో టీడీపీ సీనియర్ నేత కళావెంకటరావు ఎమ్మెల్యేగా ఉండటంతో అక్కడి రాజకీయాలకు చిన్నశ్రీను దూరంగా ఉంటున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన తాను చీపురుపల్లి రాజకీయాల్లో జోక్యం చేసుకుంటే విభేదాలు తలెత్తే అవకాశం ఉందన్న ఆలోచనతో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ వచ్చారు. దీని ఫలితంగా జడ్పీటీసీ ఎన్నికల్లో బొత్స పైచేయి సాధించారని విశ్లేషిస్తున్నారు. నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలకు రెండు వైసీపీ గెలుచుకోగా, ఒక మండల పరిషత్ నూ కైవసం చేసుకుంది. అదే సమయంలో ఒక మండల పరిషత్ లో టీడీపీతో సమానంగా సీట్లు సాధించింది.సంఖ్యాపరంగా చూస్తే టీడీపీదే మెజార్టీ అయినప్పటికీ బొత్స బలపడ్డారనేది కాదనలేని నిజమని విశ్లేషిస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు వైఫల్యం కూడా ఉందనే టాక్ నడుస్తోంది. ఎమ్మెల్యే రాజకీయ చతురతతో నడుచుకుని ఉంటే వైసీపీ ఒక్కచోట గెలిచేది కాదని, బొత్స వ్యూహాలు తెలిసిన చిన్న శ్రీనును దూరంగా ఉంచడంతో మూల్యం చెల్లించుకున్నారని సొంత పార్టీ కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల విషయంలో చిన్న శ్రీను జోక్యం చేసుకోడం హాట్ టాపిక్ అవుతోంది.పరిషత్ ఎన్నికల సమయంలో చీపురుపల్లి వైపు చూడని చిన్నశ్రీను పంచాయతీ పోరులో మాత్రం దూకుడు చూపుతున్నారు. దగ్గరుండి పార్టీ మద్దతుదారులతో నామినేషన్లు వేయించడం, వారి గెలుపు బాధ్యతను తన భుజాన వేసుకుంటున్నట్లు ప్రకటించడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గంలో రెండు మేజర్ పంచాయతీలు ఉండగా, దాదాపు 30 వేల ఓట్లు ఆ రెండు పంచాయతీల పరిధిలో ఉన్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే చీపురుపల్లి, కొండపాలెం మేజర్ పంచాయతీల్లో మెజార్టీ సాధించాల్సివుంటుందని అంటున్నారు.

ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఒక అడుగు వెనక్కి తగ్గి చిన్న శ్రీనుకు ఆ రెండు పంచాయతీలను అప్పగించాల్సివచ్చిందని అంటున్నారు. అటు బొత్స సైతం ఈ రెండు పంచాయతీలను తన వ్యక్తిగత ప్రతిష్టకు తీసుకున్నారని చెబుతున్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కొండపాలెం మేజర్ పంచాయతీలోని మూడు ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకోవడంతో అక్కడ ఆ పార్టీ పునాదులు గట్టిగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తోందని అంటున్నారు. చీపురుపల్లి పట్టణంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలను టీడీపీ గెలుచుకుంది. అయితే ఓటింగ్ సరళిని గమనిస్తే ఇక్కడ టీడీపీ, వైసీపీ మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ ఉందని చెబుతున్నారు. అదేసమయంలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎంపీ బెల్లాన కుమారుడికి మెజార్టీ వచ్చినట్లుగా విశ్లేషిస్తున్నారు.

ఈ నేపథ్యంలో చీపురుపల్లి పంచాయతీపై వైసీపీ జెండా ఎగరేయాలని మాజీ మంత్రి బొత్స పావులు కదుపుతున్నారు. పార్టీ మద్దతుదారు నామినేషన్ కార్యక్రమానికి స్వయంగా హాజరైన ఆయన కార్యక్రమానికి హాజరైన ఓటర్లను చూసి సంతృప్తి చెందారని అంటున్నారు. గెలుపుపై ఆశలు చిగురించడంతో అభ్యర్థికి ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో చీపురుపల్లి నియోజకవర్గంలో రెండు మేజర్ పంచాయతీ స్థానాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ స్థానాల్లో గెలిచిన పార్టీనే వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో హవా చూపే అవకాశం ఉండటంతో అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మరోవైపు సీనియర్ నేత బొత్స, ఆయన మేనల్లుడు చిన్నశ్రీను రాజకీయ భవిష్యత్తు కూడా ఈ రెండు పంచాయతీలే నిర్దేశించనున్నాయని అంటున్నారు.

ఏపీ కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది...రాహుల్ నజర్

ఏపీలో కాంగ్రెస్ ఉనికిపై మరోసారి చర్చ మొదలైంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రభావం చూపలేకపోవడం, షర్మిల జగన్‌తో వ్యక్తిగత వివాదాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ మద్దతు అంశం కూడా చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీపై రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి పెడతారనే ప్రచారం ఆసక్తికరంగా మారింది. ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఉందా అన్నది ఒక చర్చ అయితే ఆ పార్టీ పోరాటం ఎవరి మీద చేస్తోంది మరో చర్చ. అసలు ఈ పోరాటాలు అన్నీ ఆరాటాలేనా సొంత అజెండా వ్యక్తిగత లక్ష్యాలు కక్షలేనా అన్నది మరో కీలక ప్రశ్న. ఇవన్నీ కూడా ఏపీ కాంగ్రెస్ లో ఇంకా మిగిలి ఉన్న నిబద్ధత కలిగిన సీనియర్ నేతల నుంచి వస్తున్న సందేహాలు. అలాగే అసలు పార్టీలో ఏమి జరుగుతోంది అన్నది కూడా ఆందోళన కలిగించే వ్యవహారంగా చెబుతున్నారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిల వైసీపీ అధినేతగా ఉన్న వైఎస్ జగన్ ల మధ్య జరుగుతున్న వ్యక్తిగత వ్యవహారాలు ఆస్తులకు సంబంధించిన వివాదాలు ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి అవసరమా అన్నది కూడా మరో చర్చ. ఏపీలో చూస్తే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దగా ఉనికి చూపించింది ఏమీ లేదని విమర్శ ఉంది.

గుడ్డిలో మెల్లగా :

ఇక ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాలలో మాత్రం కాంగ్రెస్ కాస్తా కనిపించింది అంటే అది మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ క్రెడిట్ లోకే వెళ్తుందని అంటారు. ఆయన తన సొంత బలంతోనే కాంగ్రెస్ ని అక్కడా కొద్దో గొప్పో నిలబెట్టగలిగారు. అది తప్పించి మొత్తం ఏపీ వ్యాప్తంగా కాంగ్రెస్ పోటీ చేసినా సోదిలోకి లేకుండా పోయింది అని అంటున్నారు. పీసీసీ చీఫ్ హోదాలో షర్మిల కాంగ్రెస్ ని పట్టించుకోలేదని కూడా



విమర్శలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అసలైన కాంగ్రెస్ పార్టీ అభిమానులకు ఆవేదన కలిగిస్తున్నాయని అంటున్నారు.

టీకే సీఎం గా :

ఇక కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ఉన్నారు. ఆ రాష్ట్రంలో షర్మిల పీసీసీ చీఫ్ గా ఉంటూ యలహంక ప్యాలెస్ లోకి వెళ్లాలని ప్రయత్నాలను అక్కడి పోలీసులు అడ్డుకోవడం కూడా చర్చనీయాంశం అవుతోంది. తమ సొంత పార్టీకి చెందిన పీసీసీ చీఫ్ అయినా కోర్టు ఆదేశాలను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికే మొగ్గు చూపిందని కూడా గుర్తు చేస్తున్నారు. ఇక బెంగళూరు యలహంక ప్యాలెస్ చుట్టూ సాగుతున్న వివాదం ఇవన్నీ కూడా అక్కడి ప్రభుత్వానికి తెలియనివి కావని అంటున్నారు. ఆ విధంగా కాంగ్రెస్ పెద్దలకు ఫీడ్ బ్యాక్ వెళ్లే ఉంటుందని కూడా చెబుతున్నారు.

టీడీపీ మద్దతు మీద :

ఇక కాంగ్రెస్ నాయకురాలిగా ఉన్న షర్మిలకు టీడీపీ మద్దతుగా నిలవడం మీద కూడా చర్చ సాగుతోంది. చంద్రబాబుకు పెళ్ళి కార్డు షర్మిల అందించారు అన్న దాని మీద వైసీపీ సొంత మీడియా కథనాలు రాసింది. దాని మీద తప్పేముంది అని మాట్లాడటం వరకూ టీడీపీ పెద్దలు ఓకే కానీ అంతకు మించి అన్నట్లుగా షర్మిలకు మద్దతుగా నిలవడం టీడీపీ సొంత మీడియా కూడా ఆమె వైపు ఉండడం ఇవన్నీ చూసిన వారికి కేంద్రంలో ఎన్డీయే మీద కాంగ్రెస్ పోరాడుతూంటే ఏపీలో ఎన్డీయే మీద కాంగ్రెస్ ఏ మేరకు పోరాటం చేస్తోంది అన్నది కూడా చర్చిస్తున్నారు.

ఏం చేస్తారు :

దేశమంతా కాంగ్రెస్ గాలులు వీస్తున్నాయని దానిని అందిపుచ్చుకోవాలని జాతీయ స్థాయిలో ఆ పార్టీ పెద్దలు ప్రవచిస్తున్నారు మరి ఏపీలో కాంగ్రెస్ గాలి లేదా లేక వచ్చినా పట్టించుకోవడం లేదా లేక కాంగ్రెస్ నే ఏకంగా గాలికి వదిలేశారా అన్నది కూడా చర్చ సాగుతోంది. మరి ఏపీ మీద కాంగ్రెస్ ఫోకస్ పెడుతుందని కూడా మరోసారి చర్చ సాగుతోంది. అది భారీ మార్పులకు దారి తీస్తుందా లేక ఇంకా ఏమైనా జరుగుతుందా అనంది అయితే తెలియరావడం లేదు కానీ ఏపీ వైపు రాహుల్ గాంధీ చూపు ఉందని అంటున్నారు. ఈ ప్రచారంలో నిజమెంత అన్నది చూడాల్సి ఉంది.

ఇలాగైతే ఎలా సారూ...కేసీఆర్ ది వ్యూహమా ?

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్లే సమయం ఉండగా, సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కేసీఆర్ మాత్రం ఇప్పటికీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందే జనంలోకి రావాలన్న కేసీఆర్ వ్యూహం ఎంతవరకు పనిచేస్తుందన్న చర్చ సాగుతోంది.

వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారు అని బీఆర్ఎస్ నేతలు పదే పదే చెబుతున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే ఇదే మాట అంటున్నారు. హరీష్ రావు అదే ధీమాను ప్రదర్శిస్తున్నారు. అంతా బాగానే ఉంది కానీ తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలు జరిగి మూడేళ్ళు అయింది. అచ్చంగా మరో రెండేళ్ల కాలం మాత్రమే అసెంబ్లీ ఎన్నికలకు ఉంది. ఈ మూడేళ్ళలో కేసీఆర్ ఎక్కడా బయటకు వచ్చింది పెద్దగా లేదని అంటున్నారు. అంతే కాదు ఆయన అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. కానీ సభకు కూడా రావడం లేదు. కేసీఆర్ కేరాఫ్ ఫాం హౌస్ అని కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేస్తూనే ఉన్నారు. ఇంతలో మూడేళ్ళు ఇట్టే తిరిగిపోయాయి.

జనంలోకి రేవంత్ :

ఇదిలా ఉంటే జనంలోనే నిత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉంటున్నారు. సీఎం గా ఆయనకు అధికారిక కార్యక్రమాలు ఎటూ ఉంటాయి. అయితే ఆయన అనేక జిల్లాలలో అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాలకు కాంగ్రెస్ చేసిన మేలు చెబుతున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన నష్టాన్ని వివరిస్తున్నారు. అంతే కాదు

వారసత్వ రాజకీయాలను ఎండగడుతున్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ని పూర్తిగా తప్పుపడుతున్నారు. తెలంగాణాకు అది గుదిబండగా మారింది అంటున్నారు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అటు క్యాడర్ లోనూ ఇటు జనాల్లోనూ ధీమా పెరిగేలా చేస్తున్నారు. ఇక సంక్రాంతి తరువాత జిల్లాల టూర్లు రేవంత్ రెడ్డి పెట్టుకుంటున్నారు. అలా ఎన్నికలకు రెండేళ్ళ ముందే రాష్ట్రమంతా చుట్టేయాలని ఆయన భారీ ప్లాన్ తోనే ఉన్నారు. అదే సమయంలో బలమైన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ అయితే తన గ్రాఫ్ ని ఏ మేరకు పెంచుకుంది అన్నదే చర్చకు వస్తున్న విషయం.

జోడు గుర్రాలుగా :

ఇక కేసీఆర్ అయితే ఫాం హౌస్ లో ఉన్నారు కానీ కేటీఆర్ హరీష్ రావు జనంలోనే ఉంటూ పార్టీని పటిష్టం చేసే పనిని గట్టిగానే తీసుకున్నారు. అసెంబ్లీలో అయినా లేదా జనంలో అయినా లేదా పార్టీ ఆఫీసుల్లో అయినా ఈ ఇద్దరు నేతలు జోడు గుర్రాల మాదిరిగా ఉంటూ బీఆర్ఎస్ ని లేపడానికి చూస్తున్నారు. అయితే వారు ఎంత కష్టపడుతున్నా కూడా గులాబీ పార్టీ గ్రాఫ్ అనుకున్న స్థాయిలో పెరుగుతోందా అన్నదే చర్చగా ఉంది. రేవంత్ రెడ్డి దూకుడు ముందు అయితే బీఆర్ఎస్ జోడీ తేలిపోతోంది అన్నది కూడా విశ్లేషణగా ఉంది. కేసీఆర్ అవతల వైపు ఉంటేనే మజా ఉంటుందని అంటున్నారు.

గులాబీ బాస్ స్ట్రాటజీ :

ఇక చూస్తే కేసీఆర్ సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు జనంలోకి రావాలనుకుంటున్నారా అన్నది చర్చగా ఉంది. అపుడు వస్తే ఊపు వస్తుందని కూడా భావిస్తున్నారు అని అంటున్నారు. అప్పటికి ఎన్నికల మూడ్ వస్తుందని జనాలు చెప్పేది పూర్తిగా వింటారు అని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇవన్నీ ఓల్డ్ స్ట్రాటజీస్ అని మరో మాట వినిపిస్తోంది. గతంలోలా ఎన్నికల ముందు వస్తే జనాలు టర్న్ కావడం లేదని కూడా గుర్తు చేస్తున్నారు. కనీసం రెండేళ్ల ముందు అయినా జనంలోకి వస్తేనే ప్రజలు కూడా ఆలోచిస్తారని ఎన్నికల హడావుడిలో ఎంత చెప్పినా అది రాజకీయ చర్చగానే ఉంటుందని కూడా అంటున్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఇప్పటప్పట్లో వచ్చేది లేదనే అంటున్నారు. మరి చూడాలి బీఆర్ఎస్ కొత్త ఎత్తుగడలు ఏ విధంగా ఉండబోతున్నాయో.

జనసేన బలపడినట్లేనా ?

2019లో ఒక్క ఎమ్మెల్యేతో ప్రస్థానం ప్రారంభించిన జనసేన.. 2024లో 21 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాలు సాధించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 487 వార్డులు, 73 జెడ్పీటీసీలు, 938 ఎంపీటీసీలు గెలుచుకుంది. పలు మేయర్, ఎంపీపీ, వైస్ చైర్మన్ పదవులూ దక్కించుకుంది. కూటమిలో కొనసాగుతూనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీని విస్తరించడంపై పవన్ వ్యూహాలు రచిస్తున్నారు.ఏపీలో జనసేన బలపడినట్లేనా. ఈ ప్రశ్న రాజకీయ విశ్లేషకులు కూడా వేసుకుని తరచి చూస్తున్నారు. ఇక జనసేనలో కూడా దీని మీద చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేనకు పొత్తులలో దక్కిన సీట్లలో గెలుపు బాట పట్టారు. అలాగే విశాఖ వంటి చోట్ల డిప్యూటీ మేయర్ పదవితో పాటు 26 మంది కార్పోరేటర్లు గాజు గ్లాస్ పార్టీకి దక్కాయి. విజయవాడ, ఏలూరు మేయర్ సీట్లు లభించాయి. అలాగే జనసేనకు జిల్లా పరిషత్తులు అయిదు దాకా సొంతం అయ్యాయి. మునిసిపాలిటీలు తీసుకుంటే జనసేనకు దక్కినవి పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు 3 నగర పంచాయతీలు ఖాతాలో పడ్డాయి.

గ్రౌండ్ లెవెల్ లో :

ఇక రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 100 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి 3 వేల 942 వార్డులలో ఎన్నికల్లో జనసేన మొత్తం 487 వార్డుల్లో విజయం సాధించింది. జెడ్పీటీసీలు ఎంపీటీసీలు చూసుకుంటే జనసేన గెలుచుకున్నవి 73 జెడ్పీటీసీ 938 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇక ఏకగ్రీవమైన స్థానాలతో కలిపితే జనసేన మొత్తం బలం మరింత ఎక్కువగా ఉంది. ఎంపీపీ పదవులు కూడా జనసేనకు దక్కినవి 42 ఎంపీపీ పదవులు 83 వైస్ ఎంపీపీ పదవులు దక్కాయి. జెడ్పీలలో వైఎస్ చైర్మన్లు జనసేనకు 5 దాకా లభించాయి. ఇక మునిసిపాలిటీలలో 18 వైఎస్ చైర్ పర్సన్ పదవులు కూడా ఆ పార్టీ అందుకుంది. ఇక రెండవ విడతలో జరితే 23 పట్టణాలలో జనసేనకు కీలకమైన సీట్లు దక్కే చాన్స్ ఉంది.

పంచాయతీలు సైతం :

అదే విధంగా ఏపీలో 13 వేల పై చిలుకు ఉన్న పంచాయతీలలో కూడా జనసేనకు భారీగానే అవకాశాలు దక్కుతాయని అంటున్నారు. మొత్తంగా చూస్తే 2019లో కేవలం ఒక ఎమ్మెల్యేతో తన అధికార ప్రయాణాన్ని ప్రారంభించిన జనసేన 2024 ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని 21 ఎమ్మెల్యేలు రెండు లోక్ సభ, ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీలు, అలాగే పలు నామినేటెడ్ పోస్టులు దక్కించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింతగా పటిష్టం అయింది అని అంటున్నారు.

అసంతృప్తి ఉందా :

అయితే జనసేన ఒక రాజకీయ పార్టీగా పూర్తి స్థాయిలో ఎదగాలని చూస్తోంది. ఆ పార్టీ కూడా వైసీపీ టీడీపీ మాదిరిగా రాష్ట్రమంతా విస్తరించి ఏదో నాటికి ఏపీలో అధికారం అందుకోవాలని ఆలోచిస్తోంది. మరీ ముఖ్యంగా క్యాడర్ లో ఈ భావన అధికంగా ఉంది. అయితే జనసేనకు కూటమిలో టీడీపీ తరువాత ప్రాధాన్యత బాగానే లభిస్తోంది అని అంటున్నారు. కానీ రాజకీయ పార్టీలకు ఆకాంక్షలు ఉంటాయి కాబట్టి ఇది చాలదనే చర్చ ఎపుడూ ఉంటుంది. అదే సమయంలో జనసేన బలం ఇంకా ఎక్కువగా ఉందని కూడా చర్చ సాగుతోంది. సోషల్ మీడియాలో చూస్తే ఈ రకమైన పోస్టులు కనిపిస్తాయి. నిజంగా జనసేనకు ఎక్కువగానే బలం ఉండొచ్చు కానీ కూటమిలో పొత్తుల ధర్మంతోనే ఈ పోటీ చేసింది అన్నది కూడా గుర్తుంచుకోవాలని అంటున్నారు.

పవన్ వ్యూహాత్మకంగానే :

ఇక అధినేత పవన్ వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతున్నారు. ఆయన నెమ్మదిగానే పార్టీని విస్తరించుకుని వెళ్తున్నారు. 2019 నుంచి 2026 దాకా సాగిన ఏడేళ్ల జనసేన అధికార ప్రయాణంలో ఇన్ని పదవులు ఈ గ్రోత్ అన్నది నిజంగా హర్షించతగినదే అని అంటున్నారు. కానీ ఇక్కడితో ఆగిపోకూడదు అన్నది కూడా ఉంది. అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయాలను విపక్షంలో ఉన్న వైసీపీని రాష్ట్ర అభివృద్ధిని అన్నింటినీ దృష్టిలో ఉంచుకునే జనసేన తగిన విధంగా వ్యవహరిస్తోంది అని అంటున్నారు. పవన్ కూడా వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నారు అని చెబుతున్నారు. కూటమితో కొనసాగుతూనే జనసేన మరింతగా ఎలా విస్తరించాలి అన్నది జనసేన అధినాయకత్వం కార్యాచరణ రూపొందించుకుంటోందని చెబుతున్నారు. ఏది ఏమైనా ఇపుడు చూస్తే ఏపీలో టీడీపీ తరువాత ఎక్కువగా అధికార పదవులు జనసేనకే ఉన్నాయి. అలా వైసీపీని మూడవ ప్లేస్ లోకి పంపించారనే అంటున్నారు.

వంగవీటి రాధాక్రిష్ణన్...ఈ కొత్త పేరేంటి ?



విజయవాడ మేయర్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా వంగవీటి రాధా తన పూర్తి పేరు 'వంగవీటి రాధాకృష్ణన్' అని పలకడంతో అందరిలో ఆసక్తి మొదలైంది. చిన్నప్పుడు ఊటీలో చదువుకున్న సమయంలో పాఠశాల రికార్డుల్లో తమిళ శైలిలో పేరు చివర 'న్' చేరింది. అప్పటి నుంచి విద్యా ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్, ఎన్నికల అఫిడవిట్లలో అదే పేరు కొనసాగుతోంది. అందుకే ప్రమాణ స్వీకారంలో అధికారిక పేరును ఉపయోగించారు.వంగవీటి రాధా క్రిష్ణ అంటే అందరికీ తెలుసు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా 2004లో గెలిచిన రాధా క్రిష్ణ దివంగత నేత వంగవీటి రంగా కుమారుడు అన్నది ఇంకా బాగా తెలుసు. షార్ట్ కట్ లో రాధా అని కూడా బాగా పాపులర్. కానీ విజయవాడ మేయర్ గా ఆయన ప్రమాణం చేస్తున్నప్పుడు తన పేరు వంగవీటి రాధాకృష్ణన్ అని పలికారు. దాంతో సభలో ఉన్న వారు ఏమిటి ఆయన తప్పు చదువుతున్నారా లేక తాము తప్పుగా విన్నామా అన్న డౌట్ లో పడిపోయారు. అయితే రాధా తన పేరుని కరెక్ట్ గానే చదివారు అని అంతా కరెక్ట్ గానే విన్నారు అన్నది తరువాత తెలిసింది. మరి రాధా క్రిష్ణ అన్న తెలుగు పేరు కదా ఈ తమిళ్ కలిసిన క్రిష్ణన్ అన్న పేరు ఎలా వచ్చింది అన్నదే ఇపుడు అంతా ఆలోచిస్తున్నారు. అయితే ఈ పేరు వెనక ఒక స్టోరీ ఉంది. అది ఇంట్రెస్టింగ్ గానే ఉంది.

ప్రభుత్వ రికార్డులలో :

జనాలందరికీ రాధా క్రిష్ణగా పేరుతో పరిచయం ఉన్నా ఆయన పూర్తి పేరు వంగవీటి రాధాక్రిష్ణన్. అలాగే ఆయన పేరు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. అందుకే విజయవాడ నగర పాలక సంస్థ నూతన మేయర్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వంగవీటి రాధాకృష్ణన్ అనే నేను అని పలికారు. అయితే ఈ కొత్త పేరుపై చర్చ అంతటా మొదలైంది. కానీ దీని వెనుక ఉన్న అసలు కారణం ఉంది. స్కూల్ రికార్డుల ప్రకారం అదే పేరు ఉంది. రాధా తల్లిదండ్రులు మొదట వంగవీటి రాధాకృష్ణ అనే పేరు పెట్టారు. అది రాధా పెద నాన్న పేరు. అయితే రాధాని ఆయన చిన్నతనంలో తమిళనాడులోని ఊటీలో పాఠశాలలో చదివించారు. అలా ఆయన చదువుకునే సమయంలో అక్కడ పాఠశాల అధికారులు తమిళ శైలిలో ఆయన పేరు చివర 'న్' చేర్చి రాధాకృష్ణన్ గా స్కూల్ రికార్డులలో నమోదు చేశారు.

అదే పేరు కొనసాగుతోంది :

ఆ తరువాత అదే కొనసాగుతూ అధికారిక ధృవపత్రాలలోనూ ఉంది. అప్పటి నుంచి ఆయన చదువుకున్న సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, ఎన్నికల అఫిడవిట్లు ఇతర ప్రభుత్వ రికార్డులన్నింటిలోనూ అదే పేరు కొనసాగుతోంది. ఇక బయట ప్రజలకు, రాజకీయ వర్గాలకు ఆయన వంగవీటి రాధా లేదా రాధాకృష్ణగా సుపరిచితులైనప్పటికీ, చట్టపరమైన నిబంధనల ప్రకారం మేయర్ ప్రమాణ స్వీకారంలో తన అధికారిక పేరునే ఉపయోగించారు. అదన్న మాట సంగతి. మొత్తం మీద చూస్తే వంగవీటి రాధా క్రిష్ణన్ అన్నది ఆయన అసలు పేరు అని మేయర్ ప్రమాణం సందర్భంగా అంతా సరి కొత్తగా తెలుసుకున్నారు. దేశ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాక్రిష్ణన్ ఉన్నారు. అలాగే . ఇపుడు విజయవాడ మేయర్ గా రాధాక్రిష్ణన్ ఉన్నారు అని అంతా అంటున్నారు. తమిళనాడులో పుట్టి దేశానికి రాష్ట్రపతి అయిన రాధాక్రిష్ణన్ స్ఫూర్తితో అనేక మంది ఆ పేరుని పెట్టుకుంటారు ఇది ఎక్కువగా తమిళనాడులో జరుగుతుంది.

పెన్ పవర్

బుధవారం 25 నవంబర్ 2026

వైభవ్ విశ్వరూపం

52 బంతుల్లో డబుల్ సెంచరీ.. 28 సిక్సర్లతో సునామీ.. ప్రపంచ రికార్డులన్నీ గల్లంతు!



ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని సరికొత్త విధ్వంసం నమోదైంది. భారత టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ బంతిని బాదుడే బాదుడు అన్నట్లుగా విరుచుకుపడుతూ పలు అంతర్జాతీయ, దేశవాళీ రికార్డులను తుడిచిపెట్టేశాడు. కేవలం 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ (ద్విశతకం) బాది ప్రపంచ వన్డే క్రికెట్‌ను నివ్వెరపరిచాడు. లిస్ట్-ఏ వన్డే చరిత్రలోనే అత్యంత వేగవంతమైన ద్విశతకంగా ఇది చరిత్రకెక్కింది. అంతకుముందు చాడ్ బోవ్స్ 103 బంతుల్లో నెలకొల్పిన ప్రపంచ రికార్డును సూర్యవంశీ సగానికి సగం బంతుల్లోనే బద్దలు కొట్టడం గమనార్హం. గతంలో ఎన్ జగదీశన్ (114 బంతులు), హ్యారీ బ్రూక్ (114 బంతులు) పేరిట ఉన్న రికార్డులన్నీ ఈ సునామీ ధాటికి కొట్టుకుపోయాయి. దోహా వేదికగా యూఏఈతో జరిగిన ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 గ్రూప్-బి పోరులో వైభవ్ బ్యాటింగ్‌కు ప్రత్యర్థి బౌలర్లు బెంబేలెత్తిపోయారు. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే సిక్సర్ల వర్షం కురిపించిన సూర్యవంశీ.. ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా 28 సిక్సర్లు బాది యావత్ ప్రొఫెషనల్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక సిక్సర్ల ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును లిఖించాడు. 2024 రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బ్యాటర్ తన్మయ్ అగర్వాల్ కొట్టిన 26 సిక్సర్ల రికార్డును అతడు అధిగమించాడు. న్యూజిలాండ్ విధ్వంసకర బ్యాటర్ కొలిన్ మన్రో (23 సిక్సర్లు), ఆస్ట్రేలియా ప్లేయర్ డార్సీ షార్ట్ (23 సిక్సర్లు) సాధించిన మైలురాళ్లను కూడా వైభవ్ సునాయాసంగా దాటేశాడు.

వైభవ్ ఆడిన ఈ నమ్మశక్యం కాని ఇన్నింగ్స్‌లో మొదట కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత సునామీలా విరుచుకుపడుతూ 28 బంతుల్లో సెంచరీ కొట్టి లిస్ట్-ఏ క్రికెట్లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు బద్దలు కొట్టాడు. ఆ తర్వాత 40 బంతుల్లో 150 మార్కును అందుకున్నాడు. ఇది కూడా ఓ రికార్డే. అక్కడితో ఏమాత్రం ఆగకుండా అదే జోరు కొనసాగిస్తూ 52 బంతుల్లోనే 200 పరుగుల మార్కును దాటి రికార్డులను తిరగరాశాడు. లిస్ట్-ఏ చరిత్రలో వేగవంతమైన సెంచరీ, ఫాస్టెస్ట్ 150, అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ.. ఇలా అన్ని రికార్డులనూ ఒకే మ్యాచ్‌లో కొల్లగొట్టిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. వైభవ్ ధాటికి ఇండియా-ఏ కేవలం 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసుకుని సరికొత్త జట్టు రికార్డును సైతం నమోదు చేసింది.

మ్యాచ్ పన్ సైడెడ్ ఇలా అయింది!

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఆరంభంలోనే హర్షిత్ రాణా, అర్నవ్ ఖాన్ చెలరేగడంతో 20 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ యూఏఈని మాజీ భారత దేశవాళీ బ్యాటర్ హర్‌ప్రీత్ సింగ్ భాటియా అద్భుత శతకంతో ఆదుకున్నాడు. హర్‌ప్రీత్ 144 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 130 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించగా.. మహ్మద్ షహదాద్ (28), ఏతాన్ డిసౌజా (25), చివర్లో కెప్టెన్ బాసిల్ హమీద్ (నాటౌట్ 36) అతడికి విలువైన సహకారం అందించారు. భారత బౌలర్లలో అర్నవ్ ఖాన్ 10 ఓవర్లలో 43 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తా చాటగా.. హర్షిత్ రాణా, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే, షాబాజ్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత బ్యాటర్లలో వైభవ్ 53 బంతుల్లో 204 పరుగులు చేసి ఔటయ్యాడు. ఛేదించాల్సిన లక్ష్యాన్ని దాదాపు ఒక్కడే పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ (12), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (3) తక్కువ పరుగులకే వెనుదిగిరారు. రింకూ సింగ్ 27, కుమార్ కుషాగ్ర 1 నాటౌట్‌గా నిలిచి 14.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

బౌల్ట్‌ను వదిలేసి అర్ష్‌దీప్‌ను తీసుకోవడం కరెక్టేనా?: ముంబయి ఇండియన్స్ మాస్టర్ ప్లాన్‌పై ఇర్ఫాన్ పఠాన్ విశ్లేషణ!



ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు ముంబై ఇండియన్స్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలను టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఆసక్తికరంగా విశ్లేషించాడు. భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చిన తర్వాత న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్‌ను వదులుకోవడం సరైన నిర్ణయమేనని సమర్థించాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్ యువ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను రిలీజ్ చేయడం మాత్రం తనను ఆశ్చర్యపరిచిందని జియోస్టార్‌తో మాట్లాడుతూ పఠాన్ పేర్కొన్నాడు.విదేశీ లెఫ్టార్మ్ పేసర్ అయిన బౌల్ట్ స్థానంలో స్వదేశీ లెఫ్టార్మ్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చాడని, ఇది విదేశీ ఆటగాళ్ల కాంబినేషన్‌ను సరిదిద్దుకునేందుకు ముంబైకి ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని పఠాన్ విశ్లేషించాడు. అలాగే తరచూ గాయాలపాలవుతూ పూర్తి సీజన్లు ఆడలేకపోతున్న పేసర్ దీపక్ చాహర్‌ను రిలీజ్ చేయడం కూడా అర్థం చేసుకోదగినదేనని స్పష్టం చేశాడు. కొత్త బంతితో వికెట్లు తీసే స్పెషలిస్ట్ బౌలర్ ఇప్పటికే జట్టులో ఉన్నప్పుడు చాహర్‌ను పక్కనపెట్టడం సరైన నిర్ణయమేనన్నాడు. కానీ, మిచెల్ శాంట్నర్‌తో కలిసి ఇరువైపులా విదేశీ స్పిన్ దాడి చేసేందుకు అల్లా ఘజన్‌ఫర్ సరైన ప్రత్యామ్నాయంగా ఉండేవాడని, అతడిని వదులుకోవడమే ఆశ్చర్యంగా ఉందని తెలిపాడు.ఈ మార్పులు చేసినప్పటికీ ముంబై బౌలింగ్ విభాగం ఇప్పటికే అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోందని పఠాన్ అభిప్రాయపడ్డాడు. భారీ పర్స్ బ్యాలెన్స్‌తో వేలానికి వెళుతున్న ఐదుసార్లు ఛాంపియన్ ముంబై.. ఎప్పటిలాగే ఊహించని కొత్త టాలెంట్‌ను వెలికితీసి అందరినీ ఆశ్చర్యపరుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. పెద్ద బడ్జెట్‌తో మినీ వేలంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ ముంబై ఇండియన్స్ ఏదో ఒక అద్భుతం చేస్తుందని, ఈసారి వేలంలో ఫ్రాంచైజీ ఆ నిధులను ఎలా వినియోగిస్తుందో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని పఠాన్ ముగించాడు.

బంతికి ఉమ్మి: శుభ్‌మన్ గిల్ విజ్ఞప్తిని తోసిపుచ్చిన ఐసీసీ!



అంతర్జాతీయ క్రికెట్‌లో బంతికి ఉమ్మి (సలైవా) వాడకంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే ప్రసక్తే లేదని ఐసీసీ స్పష్టం చేసింది. ఈ నిబంధనను పునఃసమీక్షించాలని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. ఆరోగ్యం, క్రీడాస్ఫూర్తికి సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో ఈ విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ఐసీసీ వర్గాలు 'ఇండియా టుడే'కు వెల్లడించాయి.వెల్లింగ్‌టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసిన తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ అంశాన్ని ప్రస్తావించాడు. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై కూకబుర్రా బంతి త్వరగా మెత్తబడుతోందని, బౌలర్లకు ఏమాత్రం సహకరించడం లేదని గిల్ అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో బంతికి ఉమ్మిని వాడేందుకు అనుమతిస్తే బౌలర్లకు కొంత ప్రయోజనం కలిగేదని అభిప్రాయపడ్డాడు. "కోవిడ్ కాలం ముగిసి చాలా ఏళ్లయింది. అయినా ఇప్పటికీ బంతిపై ఉమ్మిని ఎందుకు వాడనివ్వడం లేదో అర్థం కావడం లేదు" అని గిల్ వ్యాఖ్యానించాడు.అయితే, గిల్ వాదనను ఐసీసీ పరిగణనలోకి తీసుకోలేదు. 2020లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఆటగాళ్ల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నిషేధాన్ని తాత్కాలికంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దీనిని శాశ్వత నిబంధనగా మార్చారు. మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) నిబంధనల ప్రకారం కూడా బంతి స్వరూపాన్ని మార్చేందుకు ఉమ్మిని వాడటం అనుచిత ప్రవర్తన కిందకే వస్తుంది.ఉమ్మిని వాడటాన్ని పర్యవేక్షించడం కష్టమని, కొందరు ఆటగాళ్లు స్వీట్లు, చూయింగ్ గమ్ వంటి పదార్థాలతో కలిపి ఉమ్మిని బంతికి పూసి అక్రమంగా ప్రయోజనం పొందే ప్రమాదం ఉందని ఐసీసీ భావిస్తోంది. ఇది ఇప్పటికీ ఆటగాళ్లు, అంపైర్ల ఆరోగ్యానికి ముప్పు కలిగించే అంశంగానే చూస్తోంది.ఆసక్తికరంగా, ఐపీఎల్ 2025 సీజన్ నుంచి ఈ సలైవా నిషేధాన్ని ఎత్తివేసింది. అయితే, ఇది దేశీయ టోర్నీ కావడంతో దాని ప్రభావం అంతర్జాతీయ క్రికెట్‌పై ఉండదు. ఐసీసీ నిబంధనల్లో మార్పు తీసుకురావాలంటే, ఏదైనా సభ్య దేశం సంబంధిత కమిటీ ద్వారా ప్రతిపాదన చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సలైవా బ్యాన్‌పై ఎలాంటి చర్చలు జరగడం లేదని, ఈ నిషేధం యథాతథంగా కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది.

విచిత్రంగా పోరుగున ఫేమస్ అయిన స్టార్లు





స్టైలిష్ బ్లూ డెనిమ్ జంప్‌సూట్‌లో మెరిసిపోయిన ఐషా శర్మ - ఫోటోషూట్



సొంత భాషలో ఆశించిన విజయాలు అందుకోకపోయినా ఇతర పరిశ్రమల్లో స్టార్‌డమ్ సంపాదించిన నటులు ఎందరో ఉన్నారు. దుల్కర్ సల్మాన్ తెలుగులో వరుస విజయాలతో క్రేజ్ తెచ్చుకోగా.. విశాల్, కార్తీ, ధనుష్, విజయ్ ఆంటోనీకి కూడా మంచి మార్కెట్ ఏర్పడింది. రానా, సుధీర్ బాబు హిందీలో గుర్తింపు పొందారు. రజనీకాంత్, అర్జున్, సుమన్ ప్రయాణాలూ భాషా సరిహద్దులు స్టార్‌డమ్‌కు అడ్డుకావని చాటుతున్నాయి.

భారతీయ సినీ చరిత్రలో సొంత భాషలో కంటే పొరుగు పరిశ్రమల్లో అడుగుపెట్టి తిరుగులేని క్రేజ్- స్టార్ ఇమేజ్ అందుకున్న నటులు ఎందరో ఉన్నారు. ఒక నటుడి ప్రతిభకు భాషా సరిహద్దులు అడ్డుకావని.. సరైన కథ, ప్రేక్షకుల ఆదరణ తోడైతే పరాయి గడ్డపైనా విచిత్రమైన రీతిలో అద్భుత విజయాలు సాధ్యమవుతాయని వీరి ప్రస్థానం నిరూపిస్తోంది. ప్రస్తుత తరంలో మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. మాతృభాష మలయాళంలో ఇటీవల వరుస పరాజయాలు ఎదురైనా తెలుగులో మాత్రం మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి చిత్రాలతో హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్లు అందుకుని .. లేటెస్టుగా -ఆకాశంలో ఒక తార-తో మరో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకుని టాలీవుడ్‌లో లోకల్ హీరోల స్థాయిలో ఫాలోయింగ్ సంపాదించుకున్నారు.ఇదే తరహాలో కోలీవుడ్ హీరోలైన విశాల్, కార్తీ, ధనుష్, విజయ్ ఆంటోనీ లకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. గతంలో పందెంకోడి సినిమాతో విశాల్ తమిళం కంటే తెలుగులోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకోగా.. ఆ తర్వాత కూడా తమిళంలో ఫ్లాపులు వచ్చిన ప్రతిసారీ తెలుగు బాక్సాఫీస్ వద్ద విజయాలు అందుకున్నాడు. ఇక విజయ్ ఆంటోనీ నటించిన బిచ్చగాడు తమిళంలో సాధారణ విజయం సాధిస్తే... తెలుగులో మాత్రం సంచలన వసూళ్లతో అతడికి తిరుగులేని మార్కెట్‌ను సృష్టించింది. అదేవిధంగా ఈపిరి, ఖైదీ, సర్దార్ వంటి చిత్రాలతో కార్తీ తమిళం కంటే తెలుగులోనే ఎక్కువ ఆదరణ పొందగా.. ఇటీవల సార్, కుబేర వంటి సినిమాలతో ధనుష్ సైతం తెలుగులో తన మార్కెట్‌ను బలంగా విస్తరించుకుంటున్నారు. మరోవైపు.. తెలుగు పరిశ్రమకు చెందిన రానా దగ్గుబాటి, సుధీర్ బాబు వంటి హీరోలు ఉత్తరాదిన బాలీవుడ్‌లో తమదైన ముద్ర వేశారు. తెలుగులో హీరోలుగా కొనసాగుతూనే.. హిందీలో దమ్ మారో దమ్, బేబీ, ఘూజీ వంటి చిత్రాలతో రానా దగ్గుబాటి.. టైగర్ ష్రాఫ్‌తో కలిసి చేసిన -బాఘీ- సినిమాతో సుధీర్ బాబు దేశవ్యాప్తంగా గొప్ప గుర్తింపు, ప్రశంసలు అందుకున్నారు. వీరితో పాటు మహారాష్ట్రకు చెందిన సాయాజీ షిండే, మురళీ శర్మ వంటి విలక్షణ నటులు హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించినా.. వారికి అసలైన గుర్తింపు.. స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ హోదా దక్కింది మాత్రం తెలుగు సినిమాల ద్వారానే కావడం విశేషం.సీనియర్ తరం నటులను గమనిస్తే.. కన్నడ నేపథ్యం నుంచి వచ్చిన రజనీకాంత్, అర్జున్, సుమన్ వంటి దిగ్గజాలు కూడా ఇతర భాషల్లోనే తమ అసలైన స్టార్‌డమ్‌ను నిర్మించుకున్నారు. బెంగళూరులో కండక్టర్‌గా పనిచేసిన రజనీకాంత్ తమిళంలోకి అడుగుపెట్టి -సూపర్ స్టార్-గా ఎదిగితే... కర్ణాటకలో కెరీర్ ప్రారంభించిన అర్జున్ తమిళ, తెలుగు భాషల్లో జెంటిల్‌మన్, ఒకే ఒక్కడు వంటి చిత్రాలతో -యాక్షన్ కింగ్-గా మారారు. అలాగే మంగళూరుకు చెందిన సుమన్ సైతం తెలుగు ప్రేక్షకుల ఆదరణతో 80వ దశకంలో అగ్ర హీరోగా వెలుగొందారు.

సొంత గడ్డపై ఆశించిన స్థాయిలో కలిసిరాకపోయినా.. పొరుగు పరిశ్రమల ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ నటుల ప్రయాణం ఎంతో ఆసక్తికరం. ప్రతిభ, కష్టపడే తత్వం ఉంటే ఏ భాషలోనైనా ప్రేక్షకులు అక్కున చేర్చుకుంటారని.. భారతీయ సినిమాలో భాష కంటే భావోద్వేగమే ముఖ్యమని వీరి విజయగాథలు మరోసారి చాటిచెబుతున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965